అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల, కుమురం భీం, ఆసిఫాబాద్
విద్యారంగ ప్రత్యేక సంచిక
8 పేజీలు | సోమవారం 24 జూన్ 2024 | www.navatelangana.com

సర్కారు బడి..సౌకర్యాల ఒడి..!

- పాఠశాలల ఆధునీకరణపై ప్రభుత్వం దృష్టి
- అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట వివిధ రకాల వసతులు
- ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ
- ఉదయం అల్పాహారం అందించాలని నిర్ణయం
- గురుకులాలు, కేజీబీవీలు, మాడల్ స్కూళ్లలోనూ నాణ్యమైన విద్య

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు సమకూరుతున్నాయి. అనేక మంది జీవితాలను తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించాలని ప్రభుత్వం భావించింది. పేదలు అధికంగా చదివే ఈ బడులకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వివిధ రకాల సౌకర్యాలు కల్పిస్తోంది. గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు- మనబడి పనులతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట నూతన సర్కారు చేపడుతున్న పనులు సైతం పూర్తిచేయాలని స్పష్టం చేసింది. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తయారుచేసేందుకు తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, విద్యుద్దీకరణ, బల్లలు తదితర సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందుకు ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్)ను వినియోగించుకోవాలని సూచించింది. వీటి నిర్వహణ..పర్యవేక్షణ బాధ్యతను గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు అప్పగించింది. తాజాగా ఉమ్మడి జిల్లాలో పనులను 80శాతం వరకు పూర్తికాగా.. మిగిలిన వాటిలో పనులు కొనసాగుతున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు బడి పేరు చెప్పగానే సౌకర్యాలు బాగుండవని జనాల్లో ఓ అపోహ ఉంది. విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గేందుకు ఇది కూడా ఓ కారణమని భావిస్తుంటారు. కానీ ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలతో సర్కారు బడులకు కూడా మంచి రోజులొస్తున్నాయి. గత ప్రభుత్వం మన ఊరు- మనబడి పేరిట 12 రకాల సౌకర్యాలకు ప్రతిపాధనలు రూపొందించి పనులు ప్రారంభించింది. మూడేండ్లలో జిల్లోలోని బడులన్నింటిలోనూ మౌళిక వసతులు కల్పించాలని భావించింది. ఇందుకు ఏటా 25శాతం బడులను ఎంపిక చేసి పనులు ప్రారంభించింది. కానీ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. తాజాగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో వీటిపై ఫోకస్ పెట్టింది. అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట పేరు మార్పిడి చేయడంతో పాటు ఒకే విడతలో బడులన్నింటిలోనూ ఈ సౌకర్యాలు కల్పించాలని అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా నియోజకవర్గ అభివృద్ధినిధులు(ఎస్‌డీఎఫ్) నుంచి ప్రత్యేకంగా బడులకు కేటాయించారు. పనులు ప్రారంభించేందుకు ముందుగానే 25శాతం నిధులను విడుదల చేయడంతో పనులు సాఫీగా కొనసాగుతున్నాయి. పనుల బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించింది. వీటిల్లో అవసరమైన ఫర్నీచర్, టాయిలెట్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, తరగతి గదుల నిర్మాణం, ప్రహారీగోడ, బల్లలు, మేజర్, మైనర్ రిపేర్లు, విద్యుద్ధీకరణ తదితర వాటిని చేపడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇది వరకు కేవలం పాఠ్య పుస్తకాలు మాత్రమే ఉచితంగా అందించేవారు. కానీ ఇందులో మంది పేద పిల్లలు చదువుతున్నారనే కారణంగా వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నోటు పుస్తకాలు కూడా ఉచితంగా పంపిణీ చేస్తోంది.ఇక ప్రస్తుతం మధ్యాహ్న భోజనం కొనసాగిస్తుండగా.. కొత్త ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి పిల్లలకు ఉదయం పూట అల్పాహారం కూడా పెడుతామని హామీనిచ్చింది.

గురుకులాలు, కేజీబీవీలతో నాణ్యమైన విద్య

ప్రభుత్వ బడులతో పాటు వసతితో కూడిన మరింత నాణ్యమైన విద్యనందించేందుకు గురుకులాలు నెలకొల్పారు. ఈ విద్యాలయాలు గతం నుంచి ఉన్నప్పటికీ.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మరింత అభివృద్ధి చెందాయి. ఒకప్పుడు ▸ మిగతా..4లో...



జ్యోతిబాపూలే పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

శేరు శ్రీధర్, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలల కన్వీనర్ మంచిర్యాల

నవతెలంగాణ-మంచిర్యాల



విద్యార్థులు మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని, శేరు శ్రీధర్ మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలల కన్వీనర్ అన్నారు. విద్యారంగం ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. గతంలో పేద విద్యార్థులకు చదువు భారం ఉండేది. ఎంతో మంది దళిత, గిరిజన, మైనారిటీ, బలహీన వర్గాల వారు విద్యకు దూరం అయ్యారు. కానీ విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ, ప్రతిష్టాత్మకంగా గురుకులాలను ప్రారంభించింది. విద్యార్థుల ఉజ్వల భవితకు బంగారు బాటలు వేస్తుంది. అందుకే ఎందరో మంది విద్యార్థులు 5వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ వరకు గురుకులాల్లో చదివేందుకు పోటీ పడుతున్నారు. జిల్లాలో మొత్తం 8 మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాలు ఉన్నాయి. అందులో 4 బాలురు, 4 గర్ల్స్ ఉన్నాయి. వాటిలో మొత్తం 4,200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పేద, మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులు తమ పిల్లలతో ఈ ప్రవేశ పరీక్షా రాయించి, ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలి. సంక్షేమ శాఖల గురుకులాల్లో చదివిన విద్యార్థులు ఎన్నో విజయాలు సాధిస్తున్నారు. ఒత్తిడి లేని ఉత్తమ విద్యకు గురుకులాలు మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలల్లో కూడా లేని వసతులు కల్పించి, పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యా బుద్ధులు నేర్పించి, వారి జీవితాల్లో వెలుగు నింపేందుకు ప్రభుత్వం ఈ విద్యాలయాలను ఏర్పాటు చేసింది.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన

నవతెలంగాణ-తాండూర్



ప్రభుత్వ పాఠశాలలో అత్యున్నతమైన సౌకర్యాలతో కూడిన మెరుగైన విద్యాబోధన అందించడం జరుగుతుందని ఎంఈఓ మాసాల ప్రభాకర్ తెలిపారు. విద్యారంగం ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. తాండూరు మండలంలో 28 ప్రాథమిక పాఠశాలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వం ఉచిత విద్యను అందిస్తుందని తెలిపారు. మండలంలోని కస్తూర్బా, జ్యోతిబాపూలే గురుకులాల్లో ఉచిత మెరుగైన విద్యా బోధన జరుగుతుందని తెలిపారు. 2023వ విద్యా సంవత్సరం రేచిని, అచలాపూర్, తాండూరు, తంగళ్ళపల్లి, ఉర్దూ మీడియం కస్తూర్బా స్కూల్స్‌లో పదో తరగతి విద్యార్థులు, ఉత్తమ ఫలితాలు సాధించినట్టు తెలిపారు. మండలంలోని 14 పాఠశాలల్లో ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం ద్వారా రూ.3కోట్ల వ్యయంతో పక్కా భవనాలను, డైనింగ్ హాల్స్ నిర్మాణాలను చేపట్టిందని తెలిపారు. కొన్ని పాఠశాలల భవనాలు పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ తుదిదశలో ఉన్నాయన్నారు. మండలంలోని 32 పాఠశాలల్లో అమ్మఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా రూ.87 లక్షల వ్యయంతో మైనర్ రిపేర్లు అలంకరణలకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. పూర్తిస్థాయిలో పనులు జరిగినట్టు వెల్లడించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేసినట్టు తెలిపారు. జ్యోతిబాపూలే కస్తూర్బా గురుకులాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం రుచికరమైన ఉచిత భోజనాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించేందుకు ఆసక్తి కనబర్చాలని కోరారు.

అందరి చూపు గురుకులం వైపు

- పిల్లలను గురుకులాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రుల ఉత్సాహం
- ఐదో తరగతిలో ప్రవేశాలకు విశేష స్పందన
- పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్య

నవతెలంగాణ-మంచిర్యాల

బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఉచితంగా భోజన వసతితో పాటు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఏర్పడిన గురుకులాలకు విశేష స్పందన లభిస్తుంది. కార్పొరేట్ స్థాయిలో అత్యుత్తమ బోధన అందించడమే కాకుండా ఇందులో చదివిన విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలని గురుకులాల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మంచిర్యాల జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు-20తో కలిపి ఒక డిగ్రీ కళాశాల ఉంది. 5వ తరగతిలో ప్రవేశం పొందితే, ఇంటర్ వరకు చదివే అవకాశం ఉంది. వీటితో పాటు ప్రత్యేకంగా డిగ్రీ గురుకుల కళాశాలలు ఉన్నాయి. దీంతో గురుకులాల్లో అడ్మిషన్‌లకు పోటీ పెరిగింది. కొన్ని చోట్ల తల్లిదండ్రులు గురుకులాల్లో సీటు సాధించేందుకు పిల్లలకు ప్రత్యేక కోచింగ్‌లు కూడా ఇప్పించారు. విద్యతో పాటు భోజనం, వసతి, స్టడీ మెటీరియల్, దుస్తులు, కాస్మొటిక్స్ అని ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై యేటా లక్ష రూపాయల వరకు ఖర్చు చేస్తుంది. పైసా ఖర్చు లేకుండా ఉత్తమ విద్య అందుతుండటంతో గురుకులాలకు ప్రాధాన్యం పెరిగింది.

రుచికరమైన భోజనం... సకల సౌకర్యాలు..

సన్న బియ్యంతో పాటు మటన్, చికెన్, కోడి గుడ్లు, అరటిపండ్లు వంటి అన్ని పోషక విలువలతో కూడిన చక్కటి రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించడంతో పాటు కార్పొరేట్ స్థాయి లో విద్యను అందిస్తూ, అన్ని మౌలికసదుపాయాలు కల్పిస్తున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధనా, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, స్టేషనరీ, యూనిఫామ్‌లు అందిస్తున్నారు. కాస్మొటిక్స్ కొరకు ఒక్కో విద్యార్థికి ప్రతి నెల రూ. 140 చెల్లిస్తున్నారు. మెనూ ప్రకారం ఉదయం జావ, తర్వాత బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రిపూట భోజనం అందిస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ సీట్‌లకు విద్యార్థుల నుంచి మరింత పోటీ నెలకొంది. ఐదో తరగతిలో అవకాశం రానివారు, చేరని వారు ఆ పై తరగతుల్లో ప్రవేశం కోసం ఆసక్తి చూపుతున్నారు. దీంతో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం బాగా పోటీ ఉంటుంది.



గురుకులాల్లో ప్రత్యేకతలు ఇవే..

గుల్బమ్ శ్రీధర్, మైనారిటీ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్

గతంతో పోలిస్తే ఈసారి పరీక్ష రాసిన విద్యార్థుల సంఖ్య పెరిగింది. దానికి కారణం గురుకులాల్లో సుదీర్ఘ అనుభవం గల ఉపాధ్యాయులతో ఇంగ్లిష్ మీడియంలో బోధన, విద్యార్థులపై 24 గంటల పర్యవేక్షణ, పిల్లలు ఉత్తమ ర్యాంకులు సాధించడం, ఐఐటీ, నీట్ ఎంసెట్ జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. వాటి కోసం నిపుణులతో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థుల సమస్యలను ఎప్పటికి అప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు హౌస్ మాస్టర్, హౌస్ పేరెంట్స్‌ను నియమించాం. సబ్జెక్టుతో పాటు క్రీడలు, తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. యోగ, శారీరక విద్య, మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇస్తూ విద్యార్థులను చైతన్య వంతులుగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతి విద్యార్థికి ప్లేట్, గ్లాస్, పరుపులు, దిండ్లు, బ్లాంకెట్స్, ట్రంక్ పెట్టెలను అందిస్తాము. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితంగా భోజన, వసతితో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నాం. పేద, మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పించిన వరమే ఈ గురుకులాలు.

ఎన్ఎంఎంఎస్‌లో జన్నారమే టాప్

నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ కోసం నిర్వహించే పరీక్షలలో ఎన్ఎంఎంఎస్ జన్నారం మండలం టాప్‌లో ఉందని ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు. విద్యారంగ ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని 54 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయగా, అందులో 24 మంది విద్యార్థులు జన్నారం ప్రభుత్వ పాఠశాలలో నుంచి ఎంపికై 42 శాతంతో జన్నారం ప్రభుత్వ పాఠశాల జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచాయన్నారు. మొత్తం మండలంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలు-12, యూపీఎస్ పాఠశాలలు-6, ఎంపీఎస్ పాఠశాలలు-46, ఆశ్రమ పాఠశాలలు రెండు, కేజీబీవీ ఒక పాఠశాల ఉన్నాయన్నారు. అలాగే 17 టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఈ విద్యా సంవత్సరం 12 జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో మొత్తం 616 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, బాదంపెల్లి, కలమడుగు ప్రభుత్వ పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.



అలాగే కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఈశ్వర్ 10/10 జీపీఏ సాధించి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని పొందారన్నారు. అలాగే పొనకల్ పీఎస్ నుంచి ఐదో తరగతి కోసం గురుకుల పాఠశాలలో అత్యధిక ఎంపిక అవుతున్నారన్నారు. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అక్కడి విద్యార్థులకు ప్రత్యేక బోధనలను, నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థికి రెండు జతల దుస్తులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, మంచినీరు విద్యుత్తు, సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గ్రహించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని, బడిబాట కార్యక్రమాన్ని ఆర్భాటంగా నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. గ్రామాల్లో ఎక్కువమంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయివేట్ పాఠశాలలకు పంపకుండా, ప్రభుత్వ పాఠశాలల్లోనే వారి పిల్లలను చేర్పిస్తున్నారని తెలిపారు.

డిగ్రీలో ప్రవేశానికి 'దోస్త్'

- జిల్లాలో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ
- జులై మూడు వరకు వెబ్ ఆప్షన్
- జులై 8 నుంచి తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ ఆఫ్ తెలంగాణ) ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు మూడు విడతల్లో జరగనున్నాయి. మే 6 నుంచి ప్రారంభమైన మొదటి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. అలాగే జూన్ 6 నుండి ప్రారంభమైన రెండవ దశ ప్రక్రియ ముగిసింది. ఇక మూడవ దశ ద్వారా అడ్మిషన్ల



ప్రక్రియ జూన్ 19 నుంచి జులై 2 వరకు రూ.425 రుసుముతో మూడో విడత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి జులై 3 వరకు మూడో దశ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జులై 6 వరకు మూడో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జులై 8 నుంచి డిగ్రీ కళాశాలల తరగతులు ప్రారంభమవుతాయి. మూడు దశల్లో సీటు పొందిన అభ్యర్థులు జులై 5వ తేదీ వరకు కళాశాలలో కచ్చితంగా రిపోర్ట్ చేసి సీటును కన్ఫర్మ్ చేసుకోవాల్సి ఉంటుంది.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీబీఎం, తదితర కోర్సుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ కళాశాలలన్ని కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్నాయి.

జిల్లాలో 4 ప్రభుత్వ కళాశాలలు

ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం నాలుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో వివిధ రకాల కోర్సులు, వివిధ మాధ్యమాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. నాలుగు కళాశాలలు కలిపి సుమారుగా 2500 మందికిపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తారు. లైబ్రరీ సౌకర్యం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ లాంటివి ఉన్నాయి. డిజిటల్ తరగతులు అనుభవజ్ఞులై అధ్యాపకులతో విద్య బోధన కొనసాగుతుంది. 3 సంవత్సరాల కాలం ఆరు సెమిస్టర్లతో విద్య సంవత్సరం సాగిస్తారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కొత్తరకం ఉపాధి కోర్సులను కూడా ప్రారంభిస్తోంది.

జాబ్ డ్రైవ్‌తో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం

డా.జలగం అనిత, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆదిలాబాద్.



విద్యార్థులు చదువుకోవడానికి అన్ని రకాల వసతుల నడుమ విద్య బోధనను అందిస్తున్నాము. ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యను అందిస్తున్నాము. ఉమ్మడి జిల్లాలోనే న్యాక్‌లో బీ గ్రేడ్‌తో ముందున్నాము. డిగ్రీ పూర్తయిన అనంతరం కళాశాలలో సంవత్సరానికి రెండు సార్లు ప్రత్యేక జాబ్ డ్రైవ్‌లు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాము. కాంపిటేటివ్ పరీక్షకు విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నాము.

అత్యధిక అడ్మిషన్లు అవుతాయి

స్వామి, ఉట్నూర్ కళాశాల ప్రిన్సిపాల్



ఉమ్మడి జిల్లాలోని అన్ని కళాశాలలతో పోలిస్తే మా కళాశాలలో అత్యధికంగా అడ్మిషన్లు ప్రతి ఏటా జరుగుతాయి. దాదాపు వెయ్యి మంది విద్యార్థులు మా కళాశాలలో విద్యను అభ్యసిస్తారు. ఏజెన్సీ విద్యార్థులు ఇంటర్‌తో చదువును ఆపివేయకుండా అవగాహన కల్పించి డిగ్రీలో చేర్పుతాం. అన్ని రకాలుగా సౌకర్యవంతంగా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు క్రమశిక్షణతో చదివేల. ఉన్నత ఫలితాలు సాధించడమే లక్ష్యం.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

డా.అచ్చి శ్రీనివాస్, ప్రభుత్వ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఇచ్చోడ.



ప్రభుత్వ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. అనుభవజ్ఞులై అధ్యాపకులతో విద్యార్థులకు విద్య బోధన ఉంటుంది. సౌకర్యాలతో కూడిన విద్యను ఎంచుకోవాలి. ప్రయివేటు కళాశాలలో అధిక ఫీజులు తీసుకోవడమే కాకుండా నాణ్యమైన విద్య అందుబాటులో ఉండదు. నాణ్యమైన విద్యతో డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగావకాశాలు పొందాలి. అలాగే ఇచ్చోడ, ఆదిలాబాద్ కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

యాదయ్య, జిల్లా విద్యాధికారి

నవతెలంగాణ-నస్పూర్



కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన విద్యాబోధన అందిస్తున్నామని డీఈఓ ఎస్ యాదయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాలలను అన్ని రకాల వసతులను కల్పించి అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. 479 పాఠశాలలో దాదాపుగా రూ. 16,81,66 కోట్లతో అన్ని వసతులను కల్పించామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇప్పటికే పుస్తకాలతో పాటు పాఠశాల యూనిఫామ్లను కూడా అందజేశామని తెలిపారు. పిల్లలకు మధ్యాహ్నం భోజనంతో పాటు కొన్ని పాఠశాలలో అల్పాహారం కూడా అందిస్తున్నామని అన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు అధికారులను అప్రమత్తం చేస్తున్నామని వివరించారు. 2023-24 సంవత్సర పదవ తరగతి ఫలితాల్లో గత సంవత్సరం కంటే ఎక్కువగా(92.4) ఉత్తీర్ణత శాతం సాధించామని తెలిపారు. అందులో 5 గురికి 10 జీపీఏ వచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థులు అద్భుత ప్రదర్శన కల్పించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు బోధన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తున్నాం : శైలజ

నవతెలంగాణ-నస్పూర్



ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులు క్రీడా రంగంలోనూ రాణిస్తున్నారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రావుల శైలజ అన్నారు. ఈ సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడుతూ ప్రభుత్వం కళాశాలలకు అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే లక్సెట్టిపేటలో ఇంటర్మీడియట్ కళాశాలకు కొత్త భవనం నిర్మాణం 9 నెలలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే మంచిర్యాలలోని కళాశాలకు నాలుగు గదుల పొడిగింపుకు పనులను ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి సంవత్సరం కళాశాలల అభివృద్ధికి రూ.10 లక్షలు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి ఆయా రంగంలో విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తున్నామని, బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూరులలో విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో రాణించారన్నారు. ప్రభుత్వ పాఠశాల పిల్లలు ప్రతిభలో తక్కువ కాదని ఎంసెట్లో కూడా ర్యాంకులు సాధించారని, ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలో మొత్తం 65 ఉన్నాయన్నారు. కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో క్రీడారంగంలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు వాలీబాల్, బాస్కెట్బాల్, కబడ్డీ ఇలాంటి క్రీడల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారని వివరించారు.

తరగతులను అప్‌గ్రేడ్ చేస్తున్నాం

సీహెచ్ మల్లిక, ప్రిన్సిపాల్

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాలలో పల్లవి మోడల్ స్కూల్‌ను ప్రారంభించి 7 సంవత్సరాలు గడిచింది. మొదట సంవత్సరం నర్సరీ నుంచి సెకండ్ క్లాస్ వరకు తరగతులు ప్రారంభించామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్ మల్లిక తెలిపారు. ప్రతి సంవత్సరం తరగతులు అప్ గ్రేడ్ చేస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం 7వ తరగతి పిల్లలకు విద్యను అందిస్తున్నామని, వచ్చే సంవత్సరం 10వ తరగతి వరకు తరగతులు పెంచేలా కృషి చేస్తున్నామన్నారు. పిల్లల విద్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పేరెంట్స్ దృష్టిలో మంచి నమ్మకాన్ని సంపాదిస్తున్నామని తెలిపారు. పెద్దపల్లికి చెందిన విద్య వేత్త మల్కా కొమురయ్య మొదటగా హైదరాబాద్‌లోని బోయినపల్లిలో పల్లవి మోడల్ స్కూల్‌ను స్థాపించాడని తెలిపారు. ఇప్పుడు అది రాష్ట్రం అంతట వ్యాపించి 30 బ్రాంచులు ఏర్పడ్డాయి. మన దగ్గర మంచిర్యాలతో పాటు పెద్దపల్లి, నిర్మల్‌లో పల్లవి మోడల్ స్కూల్స్ ఉన్నాయి. విద్యార్థులకు ఉన్నతమైన విద్యతో పాటు, సమాజంపై అవగాహనా కల్పించేలా సాంస్కృతిక కార్యక్రమాలు, జనరల్ నాలెడ్జ్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనుభవజ్ఞులు అయిన ఉపాధ్యాయులు, సరి పడ భవనంతో పాటు కావాల్సిన మౌలిక సదుపాయాలు సమకూర్చామని పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం 10వ తరగతి వరకు విద్యను అందించేల సిబ్బంది, కరస్పాండెంట్ ఉదారి చంద్ర మోహన్ గౌడ్ కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు.

ప్రతిభావంతులకు పట్టాభిషేకం

నవతెలంగాణ-నస్పూర్



ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఉచిత విద్యను అందిస్తున్నామని విశ్రాంతి హై స్కూల్ కరస్పాండెంట్ జక్కెన రమేష్ అన్నారు. ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ స్కూలులో చదివే పిల్లలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాల ప్రారంభించి 25 సంవత్సరాల కాలంలో విద్యార్థులు అన్ని రంగాల్లో సేవలు అందిస్తున్నారు. సాధారణ విద్యార్థులచే అత్యధిక మార్కులు సాధిస్తున్నాం. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అనుభవజ్ఞులైన టీచర్లచే విద్యాబోధన అందిస్తూ వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్మార్ట్ స్కూల్ సిస్టం ద్వారా మల్టీ మోడల్ విధానంలో విద్యను అందిస్తున్నామన్నారు.

విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం

- **వివేక వర్ధిని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాస్**

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాలలో వివేవ వర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలను 2001లో స్థాపించి చుట్టు ప్రక్కల ప్రాంతాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులు చదువుకొని గొప్ప స్థాయిలో ఉన్నారని ఆ కళాశాల ప్రిన్సిపల్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో విజయం సాధించే దిశగా మా కళాశాల యాజమాన్యం పని చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తాం అందులోమా కళాశాల నుండి ప్రతి సంవత్సరం సుమారు 20మంది వరకు ఉద్యోగాల్లో సెలెక్ట్ అవుతున్నారని పేర్కొన్నారు. సెలెక్ట్ అయిన విద్యార్థులకు కంపెనీలోనే ట్రైనింగ్‌తో పాటు ఉద్యోగం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏట యూనివర్సిటీ ర్యాంకులు సాధిస్తున్నారని, వివేకవర్ధినిలో చదువుకునే విద్యార్థులు విద్యతో పాటు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ శిక్షణను గుర్తింపు పొందిన శిక్షకులచే అందిస్తున్నామని తెలిపారు. రీయింబర్స్‌మెంట్ విషయంలో ఎన్నో ఒడి దుడుకులు ఎదురుకుంటున్నప్పటికీ కళాశాలను మాత్రం జిల్లాలో మొదటి స్థానంలో ఉంచేలా నాతో పాటు కరస్పాండెంట్స్, డైరెక్టర్లు కృషి చేస్తున్నారని తెలిపారు.

నారాయణ విజయ కేతనం

నవతెలంగాణ-మంచిర్యాల



గత సంవత్సరాలలోనే మంచిర్యాలతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో తమదైన ముద్ర వేసుకొని విజయ కేతనం ఎగుర వేస్తున్నామని నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ కవిత అన్నారు. నవతెలంగాణతో ఆమె మాట్లాడుతూ 2024లో విడుదల అయిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 30 మంది విద్యార్థులకు 10 జీపీఏ 8 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు కరాటే, డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రైమరీ విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సులతో పాటు ఇంటిగ్రేటెడ్ సిలబస్ అందిస్తున్నామన్నారు. హై స్కూల్ విద్యార్థులకు ఐఐటి, నీట్‌లలో మంచి ర్యాంకులు సాధించేలా ముందస్తు తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఫౌండర్ నారాయణ సార్ అడుగు జాడల్లో నడుస్తూ సార్ దిశ నిర్దేశంతో నారాయణ పాఠశాలను మంచిర్యాలలోనే నెం 1గా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు.

సర్కారు బడి..సౌకర్యాల ఒడి..!

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	2010
వీటి పరిధిలో చదువుతున్న విద్యార్థులు	2.60లక్షలు
ప్రాథమిక పాఠశాలలు	650
ప్రాథమికోన్నత పాఠశాలలు	580
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	780
ఉమ్మడి జిల్లాలో కస్తూర్బాగాంధీ విద్యాలయాలు	70
వీటి పరిధిలో విద్యార్థులు	15వేలు
ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు సుమారు	65
ఉమ్మడి జిల్లాలో ఆశ్రమోన్నత పాఠశాలలు	113
గిరిజన ఆశ్రమ పాఠశాలలు	1213

జిల్లాలో ఐదు వరకు మాత్రమే ఉండగా.. తాజాగా వీటి సంఖ్య పది నుంచి 20కి చేరుకున్నాయి. ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఆంగ్ల మాధ్యమం బోధిస్తున్నారు. ఇంటర్‌లో ప్రత్యేకంగా సీఓఈ(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) పేరిట కొందరు విద్యార్థులను ఎంపిక చేసి నీట్, ఐఐటీ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఫలితంగా అనేక మంది విద్యార్థులు వైద్యులు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారు. ప్రముఖ యూనివర్సిటీల్లో సీట్లు దక్కించుకొని ఉన్నత చదువులు పూర్తిచేసుకొని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఇక ఇందులో బోజనంతో పాటు వసతితో కూడిన అన్ని రకాల ఆధునిక సౌకర్యాలు విద్యార్థులకు కల్పిస్తున్నారు.

కేజీబీవీల్లోనూ నాణ్యమైన చదువు..!

బాలిక విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం కస్తూర్బాగాంధీ విద్యాలయాలను నెలకొల్పింది. చదువు మానేసిన బాలికలకు మళ్లీ విద్యనందిచడంతో పాటు వృత్తివిద్యలోనూ శిక్షణ ఇప్పించాలనేది వీటి ఉద్దేశం. కానీ ప్రభుత్వం ఈ కేజీబీవీలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటుచేసింది. వీటిలో గురుకులాల మాదిరిగానే భోజనం పెట్టడంతో పాటు వసతితో కూడిన సౌకర్యాలను కల్పిస్తున్నారు. వీటితో పాటు నాణ్యమైన విద్యనందించడంతో అనేక మంది విద్యార్థులు పది, ఇంటర్‌లో మంచి మార్కులతో రాణిస్తున్నారు. ఇది వరకు పది వరకే పరిమితం కాగా.. తాజాగా అన్ని జిల్లాల్లోనూ ఇంటర్ వరకు వీటిని ఉన్నతీకరించారు. దీంతో బాలికలు ఉన్నత చదువులు కొనసాగించేందుకు అవకాశం ఏర్పడుతోంది.

పదిలో నిర్మల్‌దే అగ్రస్థానం..!

- రాష్ట్రంలో వరుసగా రెండోసారి నిలిచిన జిల్లా
- 17వ స్థానంలో ఆదిలాబాద్..మంచిర్యాలకు 20వ స్థానం
- 31వ స్థానంలో నిలిచిన కుమురంభీం ఆసిఫాబాద్
- స్థానాలు తగ్గినా..ఉత్తీర్ణతశాతంలో మాత్రం మెరుగు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పదో తరగతిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఉమ్మడి నాలుగు జిల్లాలో ఒక జిల్లా అందరి కంటే టాప్‌లో నిలవగా.. మిగితా మూడు జిల్లాలు వెనుకంజలో నిలిచాయి. స్థానాలు దిగజారినా..ఉత్తీర్ణత శాతం మెరుగుపడటంతో ఫలితాల్లో పర్వాలేదనింపించాయి. ఉమ్మడి జిల్లాలో 34,958మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 32,368మంది ఉత్తీర్ణులయ్యారు. కేవలం 2590మంది విద్యార్థులు మాత్రమే అనుత్తీర్ణులయ్యారు. విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ.. అధికారుల పర్యవేక్షణ ఫలితంగా పదో తరగతిలో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చేందుకు కారణమయ్యాయి. ముఖ్యంగా ఈ నాలుగు జిల్లాల్లోనూ ఉత్తీర్ణత శాతంలో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించడం విశేషం.

నిర్మల్ జిల్లాలో 8908 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8823మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4300మంది పరీక్ష రాయగా 4246మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 4608మంది పరీక్ష రాయగా 4577మంది పాస్ కాగా జిల్లాలో 99.05శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో నెంబర్ 1గా నిలిచారు.

ఆదిలాబాద్ జిల్లాలో 10,374 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 9641మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 5179మంది పరీక్ష రాయగా 4744మంది పాసయ్యారు. బాలికలు 5195మంది పరీక్ష రాయగా 4897మంది ఉత్తీర్ణతతో జిల్లాలో 92.93శాతం సాధించారు.

మంచిర్యాల జిల్లాలో 9283మంది విద్యార్థులు పరీక్ష రాయగా 8579మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4748మంది పరీక్ష రాయగా 4338మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 4535మంది పరీక్ష రాయగా 4241మంది పాసయ్యారు. జిల్లాలో 92.42శాతం ఉత్తీర్ణత సాధించారు.

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 6393మంది విద్యార్థులు పరీక్ష రాయగా 5325మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 3008మంది పరీక్ష రాయగా 2366మంది పాసయ్యారు. బాలికలు 3385మంది పరీక్ష రాయగా 2959మంది పాస్ కాగా 83.29శాతం ఉత్తీర్ణత సాధించారు.



జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ మండల స్థాయి నూతన కార్యవర్గాన్ని జూనియర్ ఫారెస్ట్ అధికారులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బి శేషారాం, ఉపాధ్యక్షుడిగా లాల్ భాయ్, ప్రధాన కార్యదర్శిగా ముజ్జీపొద్దిన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కృష్ణారావు, జాయింట్ కార్యదర్శిగా కృష్ణమూర్తి కోశాధికారిగా అనిల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఫారెస్ట్ జూనియర్ అధికారుల అసోసియేషన్ జోనల్ కార్యదర్శి సుభాష్, సర్కిల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అజార్‌లు వ్యవహరించారు.



ఇంటర్, డిగ్రీలో నాణ్యమైన విద్యనందిస్తున్నాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు సేవ చేయడం లక్ష్యంగా అతి చిన్న స్థాయి నుండి విద్యాసంస్థల స్థాపించి దాని అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయడమే కాకుండా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని మాతృశ్రీ జూనియర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అన్నారు. నవతెలంగాణతో మాట్లాడుతూ 2014లో 186 మందితో కళాశాల ప్రారంభించామని, అప్పటి నుండి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మాతృశ్రీ కళాశాలలో మొదటి బ్యాచ్‌లో విద్యను అభ్యసించిన సమీన్, శ్వేత ఫిజియోథెరపీ పూర్తిచేసి ప్రాక్టీస్ చేస్తున్నారని తెలిపారు. నయాల తాలత్ ఆక్యుపంచరీ వైద్య నిపుణురాలుగా పనిచేస్తున్నారని ఇది తమ విజయమేనన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో తమ కళాశాలకు చెందిన ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని కే.అక్షయ 458, బైపీసీలో స్ఫూర్తి 418, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో టి.అక్షయ 974తో జిల్లాలో ద్వితీయ స్థానం సంపాదించినట్లు తెలిపారు. డిగ్రీలో ఉత్తమ ఫలితాలు సంపాదించామని తెలిపారు. భవిష్యత్తులో మరింత నాణ్యమైన విద్యను అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పిన ఆయన కార్పొరేట్ విద్యను కుమురం భీం జిల్లాలో అందిస్తున్నామని ఇది గర్వంగా ఉందని తెలిపారు.



ట్యూషన్లు అవసరం లేకుండా విద్యా విధానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రస్తుతం విద్యార్థులకు పాఠశాలలకు వెళ్తున్నప్పటికీ ఫ్యాషన్‌గా మారిన ట్యూషన్‌కు పంపడం పరిపాటిగా మారింది. ఇదే తరుణంలో ఆ అవసరం లేకుండా విద్యావిధానం కొనసాగిస్తున్నామని చెబుతున్న ఆసిఫాబాద్ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక ట్యూషన్ అవసరం లేకుండా విద్యా విధానం కొనసాగిస్తున్నామన్నారు. ప్రాథమిక స్థాయి నుండి కంప్యూటర్‌పై ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీష్‌లో మాట్లాడే విధంగా తయారు చేస్తున్నామన్నారు. భాషపై పట్టుతో పాటు విషయ ప్రాధాన్యత గుర్తించేలా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఎన్నో సంవత్సరాల నుండి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుండగా ప్రస్తుత విద్యా సంవత్సరం పాఠశాలలో మరిన్ని సౌకర్యాలు పెంచనున్నట్లు వివరించారు. పట్టణ నడిబొడ్డున అన్ని వసతులు కల్పించామని తల్లిదండ్రులు విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర విద్యాసంస్థలతో పోలిస్తే ఫీజులు తక్కువగా ఉన్నాయని వివరించారు.

ఏటేటా ఉత్తమ ఫలితాలతో ముందుకు సాగుతున్న 'కేరళ ఉన్నత పాఠశాల'

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఏటేటా ఉత్తమ ఫలితాలతో కాగజ్‌నగర్‌లోని కేరళ ఉన్నత పాఠశాల ముందుకు సాగుతున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ షీజా శ్రీనివాసన్ తెలిపారు. 2005లో తాము పాఠశాల ప్రారంభించగా, అప్పట్లో ఒకటి నుండి ఐదో తరగతి వరకు విద్యాభ్యాసం చేపట్టినట్లు తెలిపారు. ప్రతీ ఏటా ఒక్కో తరగతిని పెంచుకుంటూ పదో తరగతి వరకు పొడిగించినట్లు తెలిపారు. పదో తరగతిలో 100 శాతం ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతిలో ఒక విద్యార్థి పది జీపీఏ సాధించగా, 9 నుండి 9.8 జీపీఏ మధ్య 16 మంది విద్యార్థులు ఫలితాలను సాధించినట్లు తెలిపారు. 8.1 నుండి 9.0 మధ్య 18 మంది, 7.1 నుండి 8.0 మధ్య పది మంది, 6.1 నుండి 7.0 మధ్య 15 మంది, 5.1 నుండి 6.0 మధ్య నలుగురు విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పట్టణంలోని బాలాజీనగర్‌లో క్రీడా మైదానంతో కూడిన విశాలమైన భవనంలో పాఠశాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.




నాణ్యమైన అందించడానికి పటిష్ట చర్యలు

• జిల్లా విద్యాధికారి అశోక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో మంచి చెడు మార్పులకు విద్యా విధానం దారితీస్తుందనే విషయం జగమెరిగిన సత్యం. అటువంటి విద్యా వ్యవస్థను పకడ్బందీగా నడిపిస్తూ ఎన్నో ఒత్తిడిలను ఎదుర్కొంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాధికారి పార్సి అశోక్ చెబుతున్నారు. నవతెలంగాణతో మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ బడుల బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు గుర్తించి వాటి పెంపుదల కోసం ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ అందించామన్నారు. విద్యార్థుల్లో ఉత్సాహం కలిగించే ఉద్దేశంతో పాఠశాలల్లో మౌలిక వసతులు పెంపొందించడానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 426 పాఠశాలల్లో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నట్లు, దీనిలో ఇప్పటికే 60 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1258 పాఠశాలలో 64,141 మంది విద్యార్థులకు 4,78,076 పుస్తకాలు అవసరముండగా ఇప్పటికే వీటి పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ కూడా అందజేస్తున్నట్లు వివరించారు. పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్ అందజేస్తున్నామన్నారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ఉత్తమ స్థానంలో నిలబెట్టడానికి మొదటి నుండి కృషి చేయనున్నట్లు వివరించారు. గత సంవత్సరం ఫలితాల్లో శాతం మెరుగైనప్పటికీ స్థానం మెరుగు కాకపోవడంపై అధికారులను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాలలపై నిరంతరం మానిటరింగ్ చేయడంతో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పది ఫలితాల్లో స్థానాన్ని మెరుగుపరుచుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం కూడా విద్యార్థులకు రాగిజావ అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 72,000 మంది విద్యార్థులకు వర్క్ బుక్కులు, నోటుబుక్కులు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మకమైన విద్య అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమాజాన్ని కూడా పాఠశాలలో భాగస్వామ్యం చేయాలని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడానికి నిర్ణయించామని తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి నెలలో మూడవ శనివారం సమావేశం కోసం కేటాయించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు సమయసారిని పాటించడంతో పాటు పీరియడ్ పథకాలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలుంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వాటి పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తామని భరోసా ఇస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా మంచి బోధన అందించాలన్నారు.



విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిసైల్ మ్యాన్ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అంటే తెలియని వారు ఉండరు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆయన పేరు మీద జిల్లా కేంద్రంలో పాఠశాల నడుపుతు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి తమ లక్ష్యమని అబ్దుల్ కలాం పాఠశాల డైరెక్టర్ అబ్దుల్ హసన్ అన్నారు. నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ దేశ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు అబ్దుల్ కలాం ఎన్నో ఉత్తమమైన విషయాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అటువంటి ఉత్తమ వ్యక్తి పేరు పెట్టుకుని పాఠశాలను కొనసాగిస్తున్నామని, సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. విద్యార్థులకు స్టడీ అవర్స్ పెట్టడంతో పాటు చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామన్ని వివరించారు. ఇలా చేయడం వల్ల గడిచిన విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. దీనిలో జిల్లాలో కేవలం ముగ్గురికి మాత్రమే 10 జీపీఏ రాగా అందులో తమ పాఠశాల నుండి కూడా విద్యార్థిని జోయా అఫ్సిన్ 10 జీపీఏ సాధించి జిల్లాలోని ఇతర విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలిచింది. పదో తరగతి విద్యార్థుల కోసం మొదటి నుండే ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉండడంతో పాటు విశాలమైన క్రీడ మైదానం కలిగి ఉందని ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని తెలిపారు. మూడు సంవత్సరాల నుండి పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో రాత నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలో వారం రోజుల పాటు విద్యా విధానంలో భాగంగా కొలియోగ్రఫీ శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వివరించారు. పదవ తరగతి వరకు విశాలమైన తరగతి గదులు ఉన్నాయని అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, విద్యార్థులు తల్లిదండ్రులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అన్ని పాఠశాలలు తెరిచేలా ప్రయత్నాలు

• జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సాధారణంగా మానవ వనరుల అభివృద్ధి చేయడం ఎంతో కష్టమైన పని. ఆదివాసీ జిల్లా అయిన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజనుల విద్యాభివృద్ధి కోసం కృషి చేయడం కత్తి మీద సాములాంటిదే. అటువంటి కష్టతరమైన పనిని విజయవంతంగా నిర్వర్తించడంతో పాటు గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెబుతున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి నవతెలంగాణతో మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 34 పాఠశాలల్లో విద్యార్థులు చేరక గతంలో మూతపడ్డాయని ప్రస్తుత సంవత్సరం వాటిని తెరిపించే ప్రయత్నం చేస్తున్నామని, విద్యార్థులను చేర్పించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఇప్పటికే పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు యూనిఫామ్‌లను అందజేశామని తెలిపారు. కొన్నిచోట్ల విద్యార్థులు ఉండి ఉపాధ్యాయులు లేనిచోట ఇతర పాఠశాలల నుండి ఉపాధ్యాయులను పంపించి భర్తీ చేశామన్నారు. శాశ్వత ప్రాతిపదికన భవనాలు లేని పాఠశాలలకు భవనాల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న 330 ప్రాథమిక పాఠశాలల్లో 8 పాఠశాలలకు భవనాలు లేనట్లు తెలిపారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. దిశా ఆదర్శ పాఠశాలల పేరుతో ఉత్తమ విద్య అందిస్తున్నట్లు వివరించారు. గిరిజనులు డ్రాప్ అవుట్స్ లేకుండా చూడడానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో క్రీడా పాఠశాల ద్వారా విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులను నిష్ణాతులను చేస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. స్థానికులు ఉపాధ్యాయుల విద్యార్థుల సహకారంతో గిరిజన విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ఎక్కడైనా లోపాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే సరి చేయడానికి ప్రయత్నం చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేలా విద్యార్థులు కృషి చేయాలని కోరారు.



ఇంటర్ విద్యా వ్యవస్థ బలోపేతానికి అన్ని చర్యలు

● డీఐఈఓ నైతం శంకర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ దశ అత్యంత ప్రాముఖ్యత కలిగిన యవ్వనారంభదశ. ఆ దశలో విద్యార్థి చదువుపై నుండి కాక తన ధ్యాస ఇతర విషయాలపై మరలకుండా చూడడంతో పాటు విద్యార్థి అభివృద్ధికి సరైన పునాదులు వేయాల్సి ఉంటుంది. అటువంటి గురుతర బాధ్యతను నెరవేరుస్తూ జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ నవతెలంగాణతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 48 ఇంటర్మీడియట్ కళాశాలలున్నాయి. వీటిలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. గతంలో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయడంతో పాటు అతిధి అధ్యాపకులను నియమించడంతో సిబ్బంది విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. అయితే కొన్ని కళాశాలలో మౌలిక వసతులు లేవని వీటిని పూర్తి చేయడానికి తన వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. రెబ్బెన కళాశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవని అలాగే కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం లేకపోవడంతో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ప్రయివేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో గత విద్యా సంవత్సరం 100శాతం అడ్మిషన్లు సాధించి రికార్డు నెలకొల్పడం జరిగిందని, ప్రస్తుత సంవత్సరం కూడా 100శాతం అడ్మిషన్ల కోసం ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా ఆశించిన స్థాయిలో రాలేదని, ప్రస్తుత విద్యా సంవత్సరం ఆ లక్ష్యాన్ని చేరడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. అడ్మిషన్ ఫీజులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వ కళాశాలలో పూర్తిస్థాయిలో అధ్యాపకులున్నారని, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకుని వాటి అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. నాణ్యమైన గుణాత్మకమైన విద్య విద్యార్థులకు అందజేయడానికి కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. కళాశాలలో చేరే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేట్‌ను తలపిస్తున్న జూనియర్ కళాశాల



నవతెలంగాణ-వాంకిడి

ప్రయివేట్, కార్పోరేట్ కళాశాలల మాదిరిగా మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఉంది. వసతులు, గదులు, సిబ్బంది తదితర వాటిలో మెరుగ్గ ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉత్తమ ఫలితాలు సాధిస్తు కార్పోరేట్‌కు ధీటుగా నిలుస్తుంది. సంతోష్ కుమార్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత కళాశాలలో ఒకొక్క వసతి కల్పిస్తు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు.

సుందరంగా కళాశాల..

జూనియర్ లెక్చరర్ నుంచి పదోన్నతిలో భాగంగా ప్రిన్సిపల్‌గా 2021 ఫిబ్రవరి14న సంపత్ కుమార్ వాంకిడి జూనియర్ కళాశాలలో విధుల్లో చేరారు. అప్పటికే కళాశాల భవనం పరిస్థితులు సరిగ్గ లేవు. గమనించిన ఆయన సొంత ఖర్చులతో సుందరంగా తీర్చిదిద్దడం మొదలు పెట్టారు. సౌకర్యాలను కల్పించి ప్రయివేటుకు ధీటుగా కళాశాలను తయారు చేశారు. అంతే కాకుండా వేధికలు, సమావేశాల కోసం స్టేజిని కూడా నిర్మించారు.

అడ్మిషన్లపై దృష్టి

క్రపభుత్వ జూనియర్ కళాశాల అంటే విద్యార్థుల అడ్మిషన్లు తక్కువగా ఉంటాయి. ఈ మాటను తిరగరాస్తు ప్రతి సంవత్సరం 180 నుంచి 200 అడ్మిషన్లు అయ్యే విధంగా నిరంతరం పర్యవేక్షిస్తు అడ్మిషన్లను పెంచుతున్నారు. ఆయన చేస్తున్న కృషికి మండల ప్రజలు ప్రశంసిస్తున్నారు.

సాంస్కృతిక సంబరాలు

తెలంగాణ అస్తిత్వాన్ని, ఉనికికి ప్రతికలుగా నిలిచిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలను కళాశాల విద్యార్థినీ, విద్యార్థులను భాగస్వాములుగా చేస్తున్నారు. దీనికి తోడు పండుగల గురించి వారికి తెలియపరుస్తున్నారు. మండలంలో ఏ కళాశాలలు చేయనంత వైభవంగా బతుకమ్మ సంబరాలు కళాశాలలో నిర్వహించి మండల ప్రజల అభినందనలు పొందారు.

ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు

విద్యార్థి జీవితంలోనే సామాజిక సేవ కార్యక్రమాలు నేర్చుకోవాలని కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను ప్రారంభించారు. జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ, రక్తదానం శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులతో సామాజిక కార్యక్రమాల కారణంగా ఇంటర్‌మిడియట్ అధికారి అభినందనలు తెలిపారు.

ఒత్తిడిని తగ్గించడానికి విహార యాత్ర

పరీక్షలు వస్తున్నాయంటే విద్యార్థుల్లో మానసిక ఆందోళన చెందుతుంటారు. అలా వారు ఆందోళన చెందకుండా ఒత్తిడిని తగ్గించేలా విషయజ్ఞానం కోసం చారిత్రక ప్రదేశాలకు విహారయాత్రలకు తీసుకెళ్లడం ప్రారంభించారు. విద్యార్థుల చారిత్రక ప్రదేశ్యాలను పుస్తకంలో చదివి నేర్చుకున్న దానికంటే ప్రత్యేక్షంగా చూసి తెలుసుకుంటే జీవితాంతం గుర్తుంచుకుంటున్నారు.

ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు చేయూత

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరిన విద్యార్థుల ఆర్థిక స్థితిని గురించి తెలుసుంటు సహకరిస్తున్నారు. పేద విద్యార్థులకు పరీక్ష ఫీజు, మెటిరియల్స్‌ను ప్రిన్సిపాల్ తన సొంత ఖర్చులతో అందిస్తు ఆదర్శంగా నిలిస్తున్నారు. కళాశాల విద్యార్థులను తన పిల్లలుగా చూసుకుంటు చేయూతను అందిస్తు భరోసా ఇస్తున్నారు.

ప్రతిభగల విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక

సంపత్ కుమార్, ప్రిన్సిపాల్



చదువుల్లో రాణించే విద్యార్థుల్లో ఏబీసీలుగా మూడు విభాగాలుగా గుర్తించి గ్రేడ్‌లు ఇచ్చారు. వారికి గ్రేడ్ వారిగా ప్రత్యేక తరగతులు, అవసరమైన మెటిరియ్స్‌లను సమకురుస్తున్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుంటు మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ -2025 (ప్రిలిమ్స్, మెయిన్స్) పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కె. సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన బీసీ కులాల అభ్యర్థులు ఈనెల 19 నుంచి జూలై 3 వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ టీఎస్‌బీసీస్టడీసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సందేహాల నివృత్తికి 040-24071178ను సంప్రదించాలని తెలిపారు. ఆసక్తి గలవారు సంబంధిత పత్రాలతో జూలై 3లోగా టీజీబీసీ స్టడీ సర్కిల్ లక్ష్మీ నగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్- 500059 చిరునామాలో దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించే శిక్షణాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ కొలువులు, పోటీ పరీక్షల్లో రాణించాలని ఆకాంక్షించారు. స్టడి సర్కిల్‌లో నిష్ణతులైన వారితో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఇలాంటి శిక్షణాలను వినియోగించుకోవాలన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు మంచి ఉద్యోగాలు సాధించి జీవితం స్థిరపడ్డారన్నారు. పట్టణంతో పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాల యువతియువకులు ప్రభుత్వ కొలువుల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు.

ఫలితాల సాధనలో 'కృష్ణవేణి' ముందంజ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉత్తమ ఫలితాల సాధనలో కాగజ్‌నగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ముందంజలో ఉన్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ దోమల సురవర్ధన్ తెలిపారు. ఆయన 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ పాఠశాల నెలకొల్పి 16 సంవత్సరాలు పూర్తయ్యిందని, 15 ఏళ్లగా జిల్లాలోనే ఉత్తమ ఫలితాలను సాధించి గుర్తింపు తెచ్చుకున్నట్లు తెలిపారు. తమ పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లిన విద్యార్థులు ఇప్పటికే అగ్రస్థానంలో నిలిచారని తెలిపారు. మరికొంత మంది విద్యార్థులు ఆ దిశగా పయనిస్తున్నారని అన్నారు. దేశంలోనే అత్యున్నత సర్వీసు అయిన ఐఎఎస్ సాధించేందుకు ఎనిమిది మంది ప్రిపేరవుతున్నారని, ఛార్టర్ అకౌంటెంట్ పూర్తి చేసిన వారు ఉన్నారని తెలిపారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షలలో ముగ్గురు విద్యార్థులు పదికి పది జీపీఎ సాధించి జిల్లాలోనే ప్రతిభ కనబర్చారని తెలిపారు. 9.0 నుండి 10 జీపీఎ వరకు 18 మంది విద్యార్థులు ఫలితాలను సాధించారని తెలిపారు. పదో తరగతి పరీక్షాల ఫలితాల సాధనలో ప్రతీ ఏటా జిల్లాలో తామే ముందంజలో ఉంటున్నట్లు తెలిపారు.

విద్యారంగంలో కాగజ్‌నగర్ ముందంజ

● కాగజ్‌నగర్, దహెగాం మండలాల ఇన్‌ఛార్జి విద్యాధికారి భిక్షపతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యారంగంలో కాగజ్‌నగర్, దహెగాం మండలాలు ముందంజలో ఉన్నాయని ఈ రెండు మండలాల ఇన్‌ఛార్జి విద్యాధికారి భిక్షపతి అన్నారు. ఆయన 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ కాగజ్‌నగర్ ప్రాంతం మినీ ఇండియాను తలపిస్తుందని, ఇక్కడ అన్ని ప్రాంతాల వారు ఉండడంతో తెలుగు, హిందీ, ఇంగ్లీషు, బెంగాళీ మీడియాలతో విద్యాబోధన సాగుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో సీబీఎస్ఈ సిలబస్ బోధించే పాఠశాలలు కూడా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు స్థానిక సంస్థలు, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, జ్యోతిబాపూలే, కస్తూర్బా, గురుకులాలు ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా బాలురు, బాలికలకు జూనియర్ విద్యతో పాటు వసతి సౌకర్యం కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కాగజ్‌నగర్ ప్రాంతం పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇక్కడ ఐటీఐ అవసరం ఎంతైనా ఉందని, అన్నారు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఆవశ్యకత ఉందని అన్నారు. దహెగాం మండలం వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో అక్కడ వ్యవసాయానికి సంబంధించిన కళాశాల ఉంటే అక్కడి ప్రాంత వాసులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా కాగజ్‌నగర్ మండలంలో బెంగాళీలు అధికంగా ఉన్నారని, వారికి బెంగాళీ మీడియంలో బోధించే అధ్యాపకులు లేరని అన్నారు. గత పదేళ్ల నుండి ఈ సమస్య ఉండడంతో వారు ప్రైవేట్‌లలో ఇంగ్లీషు మీడియంలో విద్యాభ్యాసం చేస్తున్నారని అన్నారు. కాగజ్‌నగర్‌లో నైపుణ్యాభివృద్ధి కోర్సులు బోధించే ఇనిస్టిట్యూట్స్ ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

● టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమాజాన్ని గాడిన పెట్టడంతో పాటు నాణ్యమైన సమాజాన్ని నిర్మించడంలో నిర్మాతలుగా పేరు కలిగి ఉండి ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా ఉండే వారే ఉపాధ్యాయులు. అటువంటి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం కోసం ప్రతినబూని దానికోసమే నిరంతరం కృషి చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు నవతెలంగాణతో మాట్లాడారు. జిల్లాలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. 317 జీఓలో అనేకమంది ఉపాధ్యాయులు నష్టపోయారని వారికి లాభం చేసే విధంగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీలతో పాటు ఇతర విద్య సంస్థలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కేజీబీవీలలో బేసిక్ పే అమలు చేయాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడానికి తన సంఘం తరపున ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మౌలిక వసతులు కల్పించడం ఆహ్వానించేదగ్గదే అని అయితే ఈ పనులు నాణ్యతతో కూడుకొని ఉండేలా చూడాలన్నారు. పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసి బదిలీలు చేపట్టడం ఆహ్వానిస్తున్నట్లు అలాగే పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీతో పాటు డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. రానున్న విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఒక్క విద్యార్థి కూడా బడిబాట లేకుండా చూడడమే తమ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు విద్యార్థులకు నూతన విద్యా సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బొగ్గు బ్లాకులను వేలం వేయడం సరికాదు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేసే పద్ధతిని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను వేలం వేయకుండా సమ్మె చేసి ఆపివేసిందని, ప్రస్తుత ప్రభుత్వం అధికారులతో వేలంలో పాల్గొనడం శోచనీయమని అన్నారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌లను రూ. కోట్లతో గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తే ఆ బ్లాకులను సింగరేణికి ఇవ్వకుండా వేలం వేయడం అమానుషమని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బొగ్గు బ్లాక్‌ల వేలానికి వ్యతిరేకంగా మూడు రోజులు సమ్మె చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్ కేంద్రంలో ఉన్నప్పుడే సింగరేణి ప్రయివేటీకరణకు ఆజ్యం పోసుకుందని, ప్రస్తుతం బీజేపీతో కలిసి ప్రయివేటీకరణ దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం వేస్తే మరలా సమ్మెచేసి, బయటికి రానివ్వమని హెచ్చరించారు. సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి ఇవ్వడం ద్వారా అనేకమంది నిరుద్యోగ యువతకు అవకాశం వస్తుందని, అవగాహన లేని వారికి బొగ్గు బ్లాక్‌లను అప్పగిస్తే సింగరేణి మనుగడే ప్రశ్నార్ధకమవుతుందని అన్నారు. గుజరాత్‌లో ఇచ్చిన విధంగా నామినేషన్ ద్వారా సింగరేణి బొగ్గు బ్లాక్‌లను ఇవ్వాలని అన్నారు. అలాగే పోచారం శ్రీనివాస్‌రెడ్డి జీవితకాలం బీఆర్ఎస్‌లోనే ఉంటానని, కాంగ్రెస్ కండువా కప్పుకోవడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని కలవడానికి ఇంటికి వెళ్తే అక్రమంగా అరెస్టులు చేశారని ఆరోపించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి పెట్టెం లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, అక్కూరి సుబ్బయ్య, జక్కుల రాజేశం, గుమ్మడి శ్రీనివాస్, పెరుక సత్తయ్య, ఎండీ రఫిక్ ఖాన్, టీబీజీకేఎస్ నాయకులు రాజు నాయక్ పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు వీడ్కోలు

నవతెలంగాణ-రెబ్బెన



ఎంపీటీసీలకు ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. ఎంపీపీ సౌందర్య ఆనంద్‌తో పాటు అధికారులు ఎంపీటీసీలను సత్కరించారు. జూలై మూడవ తేదితో పదవీ కాలం పూర్తి అవుతుందన్నారు. ఈ ఐదేండ్ల పాటు ప్రజా సమస్యలతో ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అందించామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంతోష్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీఓ శంకరమ్మ, ఎంపీఓ రాజేశ్వర్ గౌడ్, ఏపీఓ రాం మోహన్, ఎంపీటీసీలు,సెక్రటరీలు, సూపరింటెండెంట్ వాసు, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన జడ్పీటీసీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డిని ఆదివారం తమ నివాసంలో ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరావు మర్యాద పూర్వకంగా కలసి, శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో పాటు అభివృద్ధి పనుల గురించి కూడా చర్చించారు. జిల్లా అవసరాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు జడ్పీటీసీ వివరించారు. కార్యక్రమంలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జడ్పీటీసీ కుమారుడు అనురాగ యాదవ్ పాల్గొన్నారు.

అందవెల్లి పెద్దవాగు బ్రిడ్జి జాప్యం

- నేడు నిరవధిక నిరాహార దీక్షకు ఎమ్మెల్యే పాల్వాయి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న పెద్ద వాగు బ్రిడ్జ్ స్థలాన్ని, వర్షానికి కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లు చెల్లించకపోవడంలో జాప్యం చేసిన కారణంగా ఈ సమస్య వచ్చిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాసి విడుదల చేశారు. సోమవారం ఉదయంలోగా ఈ అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోతే నిరవధిక నిరాహార దీక్షకు బ్రిడ్జి మీదనే కూర్చుంటానని స్పష్టం చేశారు. గత నెల రోజులుగా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఈ బ్రిడ్జి గురించి అనేక మార్లు తెలియజేయడం జరిగిందని, అయిన ఈ సమస్యని పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. నిరవధిక నిరాహార దీక్షకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

పట్టణ పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత

- మున్సిపల్ కమిషనర్ భుజంగరావు
- జిల్లా కేంద్రంలో ముమ్మరంగా సానిటేషన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణ పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ భుజంగరావు తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని కంఠకాలనీ, పైకేజి నగర్, హడ్కో కాలనీలో పలుచోట్ల డ్రైనేజీలు, కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలు జేసీబీతో శుభ్రం చేయించడంతో పాటు వివిధ ప్రాంతాల్లో నాళాలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా డ్రైనేజీలు అపరిశుభ్రంగా ఉంటే సమాచారం అందించాలని కోరారు. పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా చూడడంలో భాగంగా ప్రతిరోజు మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, నాగేందర్, సూపర్‌వైజర్లు శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ థియరీ పరీక్షలు

నవతెలంగాణ- కాగజ్‌నగర్ రూరల్

డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ 3వ సంవత్సరం సెమిస్టర్-6 విద్యార్థులకు సోమవారం నుండి థియరీ పరీక్షలు ప్రారంభమవుతాయని కళాశాల కోఆర్డినేటర్ తూడూరి దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు హల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ ఆధార్, ఐడెంటిటీ కార్డు తమ వెంట తీసుకురావాలని సూచించారు. లేని పక్షంలో పరీక్షలు వ్రాయడానికి అనుమతించమని తెలిపారు.

వర్షం..సర్వత్రా హర్షం..!

- ఉమ్మడి జిల్లాలో జోరందుకున్న వానలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- ప్రాజెక్టులకు జలకళ.. నిండుకుంటున్న చెరువులు
- పలు చోట్ల పొంగిపొర్లుతున్న వాగులు..వంకలు
- మరో రెండు రోజుల పాటు కురుస్తాయంటున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వర్షాకాలం ప్రారంభమైనా వానలు లేక నిరుత్సాహానికి గురైన అన్నదాతలకు తాజా వాతావరణ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. పంటలకు అవసరమైన వర్షాలు కురుస్తుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 80శాతం మంది రైతులు విత్తనాలు విత్తగా..మిగిలిన వారు సైతం పంట పొలాలకు పరుగులు తీస్తున్నారు. ఉల్లాసంగా ఏరువాక పనుల్లో నిమగ్నమవుతున్నారు. మరోపక్క వర్షాలు లేక బోసిపోయిన సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకోగా.. చెరువులు, కుంటలు నిండుకుంటున్నాయి. మరోపక్క ఎండిపోయిన వాగులన్ని కొత్త నీటి రాకతో ఉరకలెత్తుతున్నాయి. పలు చోట్ల వంతెనలపై వాగులు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఉమ్మడి జిల్లాలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వర్షాల రాకతో అన్నదాతలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 80శాతం మంది రైతులు వర్షాధారం మీద ఆధారపడి పంటలు పండిస్తుండటంతో తాజా వర్షాలు కొత్త పంటలకు అనువుగా మారనున్నాయి. వారం రోజుల క్రితం వర్షాలకు అనేక మంది రైతులు పత్తి, సోయా తదితర పంటలను వేశారు. ఎలాగూ వర్షాలు వస్తాయనే నమ్మకంతో విత్తనాలు వేసిన రైతులకు వరుణుడు ముఖం చాటేయడంతో ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలు వేసిన మూడు రోజుల వరకు వర్షాలు రాకపోవడం..నేలతో సరైన తేమ లేకపోవడంతో విత్తులు మొలకెత్తడంపై సర్వత్రా అనుమానం వ్యక్తమైంది. రూ.వేలు ఖర్చు పెట్టి విత్తనాలు కొనుగోలు చేసి భూమిలో నాటిన తర్వాత వర్షాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోజూ పొలాలకు వెళ్లి మేఘాల వైపు దీనంగా చూస్తుండిపోయారు. కానీ శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు పంటలకు అవసరమైన వర్షాలు కురవడంతో అన్నదాతల ఆనందం రెట్టింపు అవుతోంది. వేసిన విత్తనాల్లో కొన్ని భూమిలోనే మురిగిపోనుండగా.. అనేక విత్తనాలు మొలకెత్తేందుకు అవకాశం ఉందని పలువురు రైతులు చెబుతున్నారు.

ప్రాజెక్టులకు జలకళ..!

ఉమ్మడి జిల్లాలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా జలాశయాలు పూర్తిగా అడుగంటిపోయాయి. కొన్ని ప్రాజెక్టులు రబీ సీజన్‌లో పూర్తిస్థాయిలో పంటలకు నీరందించలేకపోయాయి. కడెం వంటి ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిగా అడుగంటిపోవడంతో కనీసం తాగునీటి సరఫరాకు కూడా ఇబ్బందులు తలెత్తింది. సాత్నాల, మత్తడివాగు, స్వర్ణ, ఎల్లంపల్లి, ఎస్ఆర్ఎస్‌పీ, గడ్డెన్నవాగు తదితర ప్రాజెక్టులకు కొత్త నీరు రావడంతో జలకళను సంతరించుకుంటున్నాయి. మరోపక్క పూర్తిగా ఎండిపోయిన చెరువులు, కుంటలు సైతం కొత్త నీరు రావడంతో నిండుకుంటున్నాయి. పంటలు, పశువులకు తాగునీటి ఇబ్బందులను దూరం చేయనున్నారు. వీటితో పాటు పలు చోట్ల వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో కాగజ్‌నగర్ వద్ద అందవెల్లి బ్రిడ్జి సమీపంలో నిర్మించిన తాత్కాలిక వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో అటు వైపు సుమారు 30 గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి.

మరో రెండు రోజులు వానలు..!

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటలకు మేలు జరుగుతుండగా.. మరో రెండు రోజుల పాటు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రాజెక్టులతో పాటు చెరువులు కూడా పూర్తిస్థాయిలో నిండుకునేందుకు అవకాశం కనిపిస్తుంది. మరోపక్క వర్షాల పట్ల అప్రమత్తంగా కూడా ఉండాలని సూచనలు చేస్తున్నారు.

తెగిన అందవెల్లి తాత్కాలిక వంతెన

- మూడు మండలాలు, 54 గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

జిల్లాలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెద్దవాగు నీటి మట్టం పెరిగింది. ఫలితంగా కాగజ్‌నగర్ దహెగాం ప్రధాన రహదారి మండలంలోని అందవెల్లి సమీప పెద్దవాగుపై నిర్మించిన తాత్కాలిక వంతెన పెద్దవాగు వరదతాకిడికి కొట్టుకపోయింది. ఈ ప్రధాన రహదారిలోని కాగజ్‌నగర్, దహెగాం, భీమిని మండలాల్లోని 51 గ్రామాలకు ఆదివారం రాకపోకలు నిలిచిపోయాయి. 19 సంవత్సరాల క్రితం అందవెల్లి పెద్దవాగుపై నిర్మించిన శాశ్వత వంతెన ఆగస్టు 2021లో కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు వరద ఉధృతికి ఒక పిల్లరు కుంగిపోయింది. అప్పుడప్పుడు అదిలినట్లు అనిపించడంతో ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, నిపుణులు పలుమార్లు వంతెనను పరిశీలించారు. కుంగిన పిల్లరు సరిచేస్తే చాలని నిర్ధారణకు వచ్చారు. 2022అక్టోబర్19లో నాలుగు పిల్లర్లు వీటిపై ఉన్న స్లాబ్లు నేలమట్టమయ్యాయి. ఫలితంగా కాగజ్‌నగర్, దహెగాం, భీమిని మండలాల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అప్పట్లో మూడు నెలల పాటు బాధిత గ్రామాల పిల్లల చదువులు, వైద్య సేవలు, నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి నిత్యం ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి తాత్కాలిక వంతెన నిర్మించిడంతో రాకపోకలుకొనసాగాయి. తాత్కాలిక వంతెన సెప్టెంబర్, 2023లో కొట్టుకపోయింది. బాధిత గ్రామాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శాశ్వత వంతెన మరమ్మతుల పనులు ప్రారంభించారు. నెలరోజుల వ్యవధిలోనే రెండోసారి తాత్కాలిక వంతెన నిర్మాణాలు పూర్తి చేయించారు. అప్పటి నుంచి తాత్కాలిక వంతెనపై నుంచి రాకపోకలు శనివారం వరకు కొనసాగాయి. మరోవైపు శాశ్వత వంతెన ఐదు పిల్లర్లు, వీటిపై స్లాబ్లు కూడా వేశారు. జగన్నాథపూర్ వైపు ఆబార్ట్‌మెంట్ పనులు కొనసాగుతున్నాయి. మరో వారం, పదిరోజుల్లో శాశ్వత వంతెన నిర్మాణాలు పూర్తిచేసేలా పనులు కొనసాగుతుండగానే భారీ వర్షం కారణంగా పెద్దవాగులో నీటి మట్టం పెరిగింది. తాత్కాలిక వంతెన కొట్టుకపోయింది. శాశ్వత వంతెన పూర్తయ్యేంత వరకు బాధిత గ్రామాలు కష్టాలు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై డీఈఈ లక్ష్మీనారాయణను సంప్రదించగా వారం రోజుల్లో శాశ్వత వంతెన నిర్మాణాలు పూర్తిచేయిస్తామని, బాధిత గ్రామాల ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు.

సేవా కార్యక్రమంలో వాసవి క్లబ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ఎప్పుడు ముందుంటుందని ఆసిఫాబాద్ వాసవి క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వాసవి ఆలయంలో క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా 60 మంది విద్యార్థులకు అతిథులుగా వచ్చిన ముక్త సురేష్, గుండా బాలేశ్వర్, పాపిని శంకర్‌లతో కలిసి నోట్ బుక్స్, పెన్నులు అందజేయడంతో పాటు ముగ్గురు వృద్ధులకు వాకింగ్ స్టిక్, ఒక పేద వ్యాపారికి తోపుడు బండి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారికి సేవ చేయడంలో తమ క్లబ్ ఎప్పుడు ముందుంటుందన్నారు. సమాజంలోని హెచ్చుతగ్గులు తగ్గించే ప్రయత్నం నిరంతరం చేస్తున్నట్లు వివరించారు. సాటివారికి సేవ చేసే గుణాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని సూచించారు. డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల వస్తువులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి తాటిపల్లి ఆదిత్య, కోశాధికారి చిలువేరు శ్రీధర్, నాయకులు గుండా ప్రమోద్, పిన్న వివేక్, కొలిపాక వేణుగోపాల్, ఫుల్లారి సంతోష్, చెట్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన రాంటెకి దేవాజీని సత్కరించారు. పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవాజీ 33 సంవత్సరాలు సర్వీస్‌లో ఎందరో విద్యార్థులకు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తేజపరుస్తూ ఉత్తమంగా, ఉన్నత స్థానాల్లో ఉండేలా కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏనగంటి బిక్షపతి, కుర్మాదాస్, రౌతు రవి కుమార్, ఎంఎల్ రాజు, ఇందారపు ప్రకాష్, రాజా కమలాకర్ రెడ్డి, బాబు రావు, జ్ఞానేశ్వర్, జయరాజ్, దేవ్ రావు, ఆత్మారాం, భీమయ్య, అరుణ్ పాల్గొన్నారు.

20 మంది పోలీసులకు పతకాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసు శాఖలో చేసిన ఉన్నతమైన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వారికి సేవా పథకాలను విడుదల చేసింది. అందులో భాగంగా జిల్లాకు చెందిన 20 మంది పోలీసు అధికారులకు సేవా పథకాలు లభించాయి. సేవా పథకాలను అందుకోనున్న పోలీసు అధికారులకు సిబ్బందికి జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆదివారం ఒక ప్రకటనలో ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఉత్తమ సేవా పథకం అందుకున్న వారిలో ఏఆర్ఎస్ఐ యువరాజ్ ఉన్నారు. సేవా పథకాలు అందుకున్న వారిలో జీవీ రమణ రెడ్డి, బి.శివరామ్, ముకుంద్ రావు, రమేష్, భీంరావు, ఆత్మారాం, ఆర్ బలీరామ్, ఆర్.గణపతి, వెంకటమ్మ, జయలక్ష్మి, పోశెట్టి, సురేష్, లక్ష్మణ్, గణపతి, వెంకట్ రావు, రాజన్న, జఫర్ ఉద్దీన్, షేక్ అమీర్, దేవిదాస్ సురేష్ ఉన్నారు.

మంటపుట్టిస్తున్న కూరగాయలు

- సెంచరీ మార్క్ దాటిన చిక్కుడు, పచ్చిమిర్చి.. చెరువలో టమాట
- కొనలేని స్థితిలో సామాన్య జనం

నవతెలంగాణ-కౌటాల

కూరగాయల ధరలు రోజురోజుకు మండిపోతున్నాయి. డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి లేని కారణంగా ధరలు ఆకాశంటుతున్నాయి. ఇప్పటికే చిక్కుడు, పచ్చిమిర్చ సెంచరీ మార్క్ దాటగ టమాట కూడా రూ.90 కిలో పలుకుతూ చేరువలో ఉంది. మండల కేంద్రంలో ప్రతి సోమవారం వారసంత నిర్వహిస్తుంటారు. వారసంతకు వచ్చే వినియోగదారులు కూరగాయల ధరలు వింటే నివ్వెరపోతున్నారు. పచ్చిమిర్చి కిలో రూ.100, చిక్కుడుకాయ కిలో రూ. 100, టమాటా కిలో రూ.90 పలుకుతున్నాయి. ఏ కూరగాయలు ధరలు విన్న సామాన్యునికి మంట పుట్టిస్తున్నాయి. పేదవాడు కొనలేని విధంగా కూరగాయల ధరలు ఆకాశాంటుతున్నాయి. నెలరోజుల నుంచి కూరగాయల ధరలు ఈ విధంగా పెరగడంతో ప్రజలు వారసంతకు వెళ్లి కూరగాయలంటే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. 5 వారాలుగా సంతలో కూరగాయల ధరలు పెరుగుతూ వస్తున్నాయి.

సామాన్యునికి ఆర్థిక ఇబ్బంది..

కూరగాయల ధరలు పెరగడంతో ప్రజలు కొనడానికి వెనుకాడుతున్నారు. సంతకు వెళ్లి కూరగాయల ధరలతో పేద మధ్యతరగతి కుటుంబాల్లో కూరగాయలు లేకుండానే భోజనం చేయాల్సి వస్తుంది. రోజు కూలీ పని చేసిన సరిపడా కూరగాయలు కొనలేక పోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో సంబంధిత శాఖ అధికారులు ధరల నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పేద కుటుంబాలకు శాపంగా మారింది.

తల్లడిల్లుతున్న వినియోగదారులు....

ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలతో పేద సామాన్య మధ్యతరగతి ప్రజలు కూరగాయల ధరలు వినగానే నోరెళ్ళ పెడుతున్నారు. ఎప్పటికప్పుడు కూరగాయల ధరలు పెరగడమే తప్ప తగ్గడం లేదు. ధరలు స్థిరంగా లేకపోవడంతో రెండు మూడు రోజుల కూరగాయలను నిలువ చేసుకోవడానికి వెనుకాడుతున్నారు. మార్కెట్లో సరుకు తగ్గిందని ప్రచారం బయటకి వచ్చిందంటే చాలు ఉన్న నిలువలకు రెక్కలున్నట్లుగా ధరలు అమాంతంగా పెరిగిపోవడం. కూరగాయల సాగు విస్తీర్ణం రానురాను తగ్గిపోవడంతో ధరలకు హద్దు అదుపు లేకుండా పోతుంది.

కూరగాయల సాగుపై దృష్టి పెట్టని రైతులు..

వర్షభావ పరిస్థితులు తీవ్రంగా వెంటాడుతున్నాయి. గత ఖరీఫ్ పంట సాగుతో కూరగాయల పంటలు ఎండిపోయి అప్పటినుంచి వర్షాలు పడక కౌటాల మండలంలో సాగు అధికంగా లేకపోవడంతో కూరగాయల సాగు తగ్గిపోయింది. దీంతో బయట నుండి కూరగాయలకు ధరల ఆకాశాన్ని అంటుతున్నాయి. మార్కెట్‌లో ప్రతి వస్తువు ధర కొండెక్కి కూర్చుంటుంది. నెల క్రితం కూరగాయల ధరలు కిలో రూ.20 నుండి 30 లోపు ఉన్న అన్ని ధరలు ఒకేసారి రెట్టింపు కావడంతో ఏం కొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదు అనే విధంగా మారింది. రైతులు పండించిన కూరగాయలకు మద్దతు ధర ఉండదు కానీ వ్యాపారులు విక్రయించే కూరగాయలకు ధరలు మాత్రం



పెరిగిపోతుంటాయి. ధరలు అదుపులో ఉండాల్సిన అధికారులు ఏమి ఎరగనట్టు వ్యవహరిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సతమతం

నెర్పెల్లి వెంకటి, తలోడి



రోజురోజు నిత్యావసర వస్తువుల ధరలతో సతమతం అవుతున్నాం. మార్కెట్‌కెళ్లి ఏం కొనుగోలు చేసిన ధరలు మండిపోతున్నాయి. సామాన్య ప్రజలకు ధరలు అందుబాటులోకి తీసుకువచ్చేల రేషన్ దుకాణాల నుంచి కూరగాయాలను పంపిణీ చేయాలి.

అధికారులు పట్టించుకోవాలి..

దాగాం ఆగయ్య, కౌటాల



రైతులు పండించిన కూరగాయలకు మద్దతు ధర ఉండదు. కానీ వ్యాపారులు విక్రయించే కూరగాయల ధరలు పెరుగుతాయి. పగలంతా కష్ట పడి రాత్రి బుక్కెడు బువ్వ తిందామంటే కూరగాయల ధరలు మంట పుట్టిస్తున్నాయి. ప్రజల కష్టాలు తీర్చాల్సిన ప్రభుత్వాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

ఘనంగా బలిదాన్ దివస్

నవతెలంగాణ-ఉట్నూర్



దేశం కోసం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం మరువలేనిదని, బీజేపీ నాయకులు రాథోడ్ రితేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో పులాజి బాబా కళాశాలలో జన సంఘ్ వ్యవస్థాపకులు, శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మండల అధ్యక్షులు కొలిపాక రాజశేఖర్, బింగి వెంకటేష్, సల్గర్ రవీందర్, సడిగె రాజేశ్వర్, గాలి శ్రీకాంత్, తన్నీరు సతీష్ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సిరికొండ



మండల కేంద్రానికి చెందిన సూర్యవంశీ రాజేశ్వర్ అనే ఆర్మీ జవాన్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో విధులు నిర్వహిస్తూ, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల నాయకులు పెంటన్న, ఇక్బాల్, రాజన్న, బియ్యాల మల్లేష్, రోహిదాస్, ఇచ్చోడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సర్వేల పేరుతో వచ్చే ప్రయివేట్ వ్యక్తులను నమ్మొద్దు : కమీషనర్

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

సర్వేల పేరుతో డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయల వద్దకు వచ్చే వ్యక్తులను నమ్మి సదరు కాలనీవాసులు మోసపోవద్దని మున్సిపల్ కమీషనర్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. అనాధికార వ్యక్తులు ఎవరికి సర్వే చేసే అధికారం లేదని, ఆయన తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేని వ్యక్తులు వచ్చి ఆధార్, బ్యాంక్ అకౌంట్ తదితర ఏమైనా వివరాలు అడిగితే చెప్పి మోసపోవద్దని పేర్కొన్నారు. సర్వేల పేరుతో డబుల్ బెడ్ రూం నివాస సముదాయాల్లో తిరిగే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

- వాడవాడలా తిరిగి సమస్యలు తెలుసుకొని
- పరిష్కరిస్తానని హామీ



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యల గురించి వాడవాడలా తిరుగుతూ కాలనీ వాసులతో ముచ్చటించారు. వాడల్లో రోడ్లు, డ్రైనేజీల సమస్యలున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారి కష్టతరంగ ఉందని కాలనీవాసులు వాపోయారు. తమ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల గురించి ఆరా తీశారు. విద్యార్థులతో ముచ్చటించారు. వసతుల గురించి ఆరా తీశారు. సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పెంటన్న, ఇక్బాల్, రాజన్న, రోహిదాస్, సూర్యకాంత్, బియ్యాల మల్లేష్, పాండు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-తలమడుగు

ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ డివిజన్ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ అన్నారు. ఆదివారం మండలంలోని పూనగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఆదివాసీ తెగల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆదివాసుల కోసం స్పెషల్ డీఎస్సీ, ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ నిరుద్యోగుల చేతనే ఉద్యోగాలు భర్తీ చేయాలని అన్నారు. సాగులో ఉన్న ప్రతి రైతుకు పోడు భూముల పట్టాలు ఇచ్చి, అన్ని విధాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఆదివాసులు, నాయకులు, ఆదివాసీ విద్యార్థులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని ముక్రా (కె) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కాంబ్లే వివేకానంద, సోదరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ఆదివారం మండలంలోని ముక్రా(కె) గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్, పాండురంగ్, మహేందర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, గులాబ్, కరణ్ గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా భీమన్న దేవుని పండుగ

నవతెలంగాణ-తాంసి

ప్రతి యేటా నిర్వహించే భీమన్న దేవుని పండుగను తాంసి మండల కేంద్రంలో ఆదివారం ముదిరాజ్ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమన్న దేవునికి డప్పు వాయిద్యాలతో ముదిరాజ్ కుల పెద్ద ఇంటి నుంచి భక్తి శ్రద్ధలతో భీమన్న దేవుని దగ్గరకు వెళ్లి నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని, వర్షాలు సకాలంలో కురవాలని, గ్రామస్తులు సుఖ, సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుగ్గిళ్ల పొచ్చన్న, మండల బీసీ యువజన విభాగం అధ్యక్షుడు దారవేణి రాఘవేంద్ర, సంఘం నాయకులు స్వామి, రమాకాంత్, సాయి, శ్రీకాంత్, నవీన్, రాకేష్, శివాజీ, అశోక్ వెంకట్ ఉన్నారు.



గుంతలమయంగా రోడ్డు..
రాకపోకలకు ఇబ్బందులు..

- మరమ్మతులు చేపట్టని సంబంధిత శాఖాధికారులు

నవతెలంగాణ-నార్నూర్


అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంత రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షకాలం నేపథ్యంలో ఏర్పడిన గుంతల్లో నీరు చేరి, మరింతా చెడిపోతున్నాయని అదేవిధంగా, వాహనాలు సైతం తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయని, ప్రయాణికుల సైతం గుంతల రోడ్లో ప్రయాణించి, తరుచూ ఆస్పత్రుల పాలవుతున్నామని పలువుతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లో చాలా గ్రామీణ ప్రాంతాల్లో ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి అనుసంధానం చేస్తూ ప్రభుత్వం లింకు రోడ్లు నిర్మాణం చేపట్టింది. ఆ రోడ్లు ఇప్పుడు మరమ్మతులకు నోచుకోకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. వివిధ అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడుగడునా గుంతలు ఏర్పడి ప్రయాణానికి అంటంకంగా రోడ్ల పరిస్థితి ఉందని



మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడిహత్నూర్ నుంచి నార్నూర్ మండల కేంద్రానికి, బలాన్‌పూర్ నుంచి సోనాపూర్, ఇలియాస్ నగర్ నుంచి దేవాపటార్, నార్నూర్ నుంచి లోకారి, నాగల్‌కొండ నుంచి నార్నూర్, సోనాపూర్ నుంచి బేతాల్‌గూడ, మాలేపూర్ ఎక్స్ రోడ్ నుంచి ఉమ్రి, గంగాపూర్ నుంచి మహాగావ్, ఎంపల్లి తదితర గ్రామాల వైపు వెళ్లే రహదారులు గుంతల మయంగా ఉండటంతో వాహనదారులు గుంతలను తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు ప్రభుత్వాలు మారుతున్న రోడ్డు దుస్థితి మారడం లేదని వాపోతున్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి, మరమ్మతు పనులు చేపట్టాలని రోడ్డు లేని గ్రామాలకు మంజూరైన రోడ్డు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి

జాదవ్ దత్తా, బంజారా నాయకులు



ప్రభుత్వం, అధికారులు స్పందించి, వెంటనే రోడ్డు లేని గ్రామాలకు మంజూరైన రోడ్డు నిర్మించాలి. గుంతల మయంగా తయారైన రోడ్డును మరమ్మతు పనులు చేయించాలి. చాలా గ్రామాలకు వర్షాకాలంలో వాహనాలు అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితిలో రోడ్లు ఉన్నాయి. అంబులెన్స్‌లు రాలేక, పలువురు మృత్యువాత పడ్డ సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి, రోడ్డు మరమ్మతు పనులు చేయించాలి.

క్రీడా స్ఫూర్తిని చాటి పథకాలు సాధించాలి

- జాతీయ ఓలంపిక్ డే
- పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచంలో పేద దేశాలు క్రీడల పట్ల స్ఫూర్తిని చాటుతూ ప్రపంచ స్థాయిలో రాణిస్తున్నారని, వారిని చూసి క్రీడాకారులు ఎంతో నేర్చుకోవాలని వారికి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం జాతీయ ఓలంపిక్ డేను పురస్కరించుకొని ఇందిరా ప్రిదయర్శిని స్టేడియంలో రన్‌ను నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొని క్రీడ జ్యోతి వెలిగించి రన్‌లో పాల్గొన్నారు. కాగా క్రీడాకారులు కరాటే విన్యాసాలు చేసి అబ్బురపరిచారు. అనంతరం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల పట్ల పేద దేశాలు స్ఫూర్తి చాటుతూ ప్రపంచ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారన్నారు. వారిని చూసి ఇక్కడివారు కూడా వారు ఎంచుకున్న క్రీడ రంగంలో రాణించాలన్నారు. ఖేలో ఇండియాలో ఆదిలాబాద్‌కు కావాల్సిన వసతులను ఎంపీ నగేష్ సహకారంతో



పూర్తి చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. క్రీడాలను ప్రోత్సహించేలా తాము ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఓలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పేటా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారధి, స్వామి, షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని రవి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిచరణ్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, దయానంద్, కోచ్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు



- కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ

నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలోనే రెండు లక్షల రుణమాఫీ కార్యరూపం దాలుస్తుండటం అన్నదాత ముఖాల్లో ఆనందం నింపుతోందని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం ప్రకటనపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని తేజాపూర్ గ్రామంలో రుణమాఫీపై సంతోషం వ్యక్తం చేస్తూ ఆదివాసీ, గిరిజన రైతులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. రైతుల వ్యవసాయ పొలంలో విత్తనాలు విత్తి.. స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. ఇది నిజంగానే యావత్ తెలంగాణ రైతులకు మంచి శుభ వార్త అని తెలియజేశారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను ఎప్పుడు తప్పదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుసాగుతోందన్నారు. ఆనాడు వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించిన విధంగా రైతు రుణమాఫీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి చూపిస్తోందన్నారు. జిల్లా రైతాంగం తరపున సీఎంకు, కేంద్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తేజాపూర్ గ్రామ పటేల్ గోవింద్‌రావు, కాంగ్రెస్ నాయకులు కనక సుదర్శన్, కాంబ్లె విశాల్, రాథోడ్ శ్రీకాంత్, మార్లవాయి మాజీ సర్పంచ్ ప్రతిభ, ఆదివాసీ రైతులు ఉన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు నగేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం వచ్చే నెలలో నిర్వహించే జిల్లా మహాసభల విజయవంతంపై పలు తీర్మాణాలు చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు దివ్యాంగుల సమస్యలపై నిర్లక్ష్యం చేశాయన్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల హక్కులు, చట్టాల పరిరక్షణతో పాటు సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా వందశాతం రాయితీతో రుణాలు, ఇందిరమ్మ ఇండ్లలో ఐదు శాతం, 35 కిలోల బియ్యం కోసం అంత్యోదయ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి అరిఫా బేగం, ఉపాధ్యక్షులు వజ్జల పొచ్చన్న, జిల్లా కార్యదర్శి పొచ్చన్న, జాయింట్ సెక్రటరీ సర్పే ప్రవీణ్, నాయకులు కొత్త పెల్లి సత్యనారాయణ, రాగి యోగేష్, ఇమ్రాన్ కురిసే, అనసూయ, బుచ్చక్క, మెహబూబా, మసురుద్, మారుబాయ్ పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీలో పర్యటించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిల్వ నీరు ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేశారు. దోమలు వృద్ధి చెందకుండా మున్సిపల్ శాఖ తరపున ఆయిల్ బాల్స్, ఫాగింగ్, పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా దోమలు వృద్ధి చేందకుండా ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను మురికికాలువల్లో వేయకుండా, మున్సిపల్ వాహనంలోనే వేయాలని సూచించారు. ఆయన వెంట సానిటరి ఇన్స్‌పెక్టర్ నరేందర్, సిబ్బంది ఉన్నారు.

డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఒకే దేశం ఒక ప్రధాని అనే నినాదంతో ముందుకు సాగిన మహానీయుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని ఆయన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకొని బలిదాన్ దివాస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జాతీయవాద ఆలోచనను ప్రోత్సహించి, దేశంలో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయ మార్గం చూపిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. దేశ సమగ్రతను కాపాడేందుకు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్టికల్ 370పై జరిగిన ఒప్పందంతో ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేసి కెబినేట్ నుంచి వైదొలగారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలన సాగిస్తు ఆర్టికల్ 370ను రద్దు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్న, వేణుగోపాల్, ఆదినాథ్, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటేను నేర్చుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుత కాలంలో మహిళలు, బాలికలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటేను నేర్చుకోవాలని షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని రవి అన్నారు. ఆదివారం పట్టణంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సహ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టింగ్ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరై సాయిని రవి కుమార్ పిల్లలకు బెల్టులను అందించారు. ఈ సందర్భంగా షూటింగ్ బాల్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని రవి కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళలు, బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. దాడులు పెరుగుతున్న నేపథ్యంలో మానసికంగా, శరీరకంగా ధృడంగా ఉండాలన్నారు. బెల్ట్ గ్రేడింగ్ లో ప్రతిభచాటిన వారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నడిమెల హరిచరణ్, సాహ తైక్వాండో క్లబ్ మాస్టర్ వీరేష్, శృతి, మాధవి, రాథోడ్ వనిత, శివప్రసాద్ పాల్గొన్నారు.

పసిపిల్లలతో బిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-సారంగాపూర్



పసిపిల్లలతో బిక్షాటన చేయించే వారిపైన కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అడెల్లి, మహా పోచమ్మ దేవస్థానం పరిధిలో పిల్లలతో బిక్షాటన చేయిస్తున్నారని సమాచారం అందుకున్న జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది, 1098 చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు ఆదివారం పోలీసు సిబ్బందితో కలిసి పరిసర ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో జగిత్యాల జిల్లాకు చెందిన ఒక మహిళ తన కూతురుతో బిక్షాటన చేయగా పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించి, తల్లికి అప్పగించారు. ఆ అమ్మాయి జగిత్యాల జిల్లా ఉపులమడుగు పాఠశాలలో 4వ తరగతి చదువుచున్నట్టు తెలిపింది. ఇకమీదు ఎవరైనా పిల్లలతో బిక్షాటన చేయిస్తే టోల్ ఫ్రీనెంబరు 1098కి ఫోన్ చేయాలని ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ సిబ్బంది పగ్గం రాజు, బాస శ్రీనివాస్, నరేందర్, శైలజ, కరుణశ్రీ, లక్ష్మణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయగౌరి, మమత, 1098 సిబ్బంది గంగాధర్, కవిత, పద్మావతి, ఎఎస్సై వసంత్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీసులు మనోజ్ కుమార్, సురేందర్, రవిందర్, గంగమ్మ, రాజాగౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మెలోకి రిమ్స్ జూడాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో నేటి నుంచి అత్యవసర సేవలు మినహాయించి అన్ని సేవలు నిలిపి వేసి సమ్మె చేపడుతున్నట్టు రిమ్స్ జూడాల అధ్యక్షుడు సందీప్‌చారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని, గత రెండు రోజులుగా నిరసన చేపట్టిన ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. ఈ మేరకు విధులు బహిష్కరించి, సమ్మెలోకి దిగుతున్నట్టు స్పష్టం చేశారు. డాక్టర్ల స్టైఫండ్ పెండింగ్‌లో ఉందని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | జూన్ 24, 2024 | www.navatelangana.com

వర్షం కోసం గ్రామస్తుల కప్పతల్లి ఆటలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 25 రోజులు గడిచినప్పటికీ వర్షం రాకపోవడంతో జిల్లాలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కోసం మండలంలోని మోతుగూడ గ్రామానికి చెందిన రైతులు కప్పతల్లి ఆటలు ఆడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షం రాకపోవడంతో చేన్‌లో నాటిన పత్తి గింజలు చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కూడా నాటిన గింజలు మొలకెత్తలేదన్నారు. వందలాది ఎకరాల్లో గింజలు మొలకెత్తని పరిస్థితి ఉందని, అందుకే కప్పతల్లి ఆటలతో దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య ప్రాంతంగా గుర్తిస్తాం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



కాగజ్‌నగర్ రేంజజ్‌లోని కదంబ రిజర్వు ఫారెస్టు ఏరియా, పెంచికల్‌పేట్ రేంజి పరిధిలోని కొండపల్లి రిజర్వు ఫారెస్టులో గల వృక్ష శిలాజాలను పరిశిలించేందుకు జియోజలజి సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ మంజుష మహాజన్, సినియర్ జియోలజీ ఎస్.చక్రవర్తి సీసీఎఫ్, ఎఫ్‌డీపీటీ, కేటీఆర్ సర్కిల్ శాంతరాం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వృక్షశిలాజాలు ఎలా ఏర్పడ్డాయి, వాటి వయసు ఎంత, రాళ్ల విచ్ఛేదనం చెందిన తీరును పరిశీలించారు. ఇక్కడ వివిధ రకాల చెట్లు, ఆర్చిడ్స్ పరిశీలించి ఈ ప్రాంతాన్ని జీవ వైవిధ్య ప్రాంతంగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్ అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం..అధికారుల అలసత్వం

- కొట్టుకుపోయిన అందవెల్లి పెద్దవాగు తాత్కాలిక వంతెన
- మూడేండ్లుగా ప్రజలకు తప్పని ప్రయాణ పాట్లు
- ఇంకా పూర్తికానీ వంతెన నిర్మాణం



నిచ్చెన సహాయం తో వంతెన ఎక్కుతున్న ప్రయాణికులు

నవతెలంగాణ-దహెగాం

ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా మూడు మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాల ప్రజలకు ప్రయాణపు పాట్లు తప్పడంలేదు. మూడు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు వరదలు ఉప్పొంగడంతో కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగు పై నిర్మించిన వంతెన పిల్లర్లు కుంగిపోయిన విషయం తెలిసిందే. దీంతో కుంగిపోయిన పిల్లర్ల స్థానంలో నూతన పిల్లర్ల నిర్మాణం కోసం నిధులు మంజూరైనప్పటికీ మూడేండ్లుగా వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో వర్షాకాలం వస్తే ప్రయాణం ప్రాణ సంకటంగా మారుతుంది. ఈ ఏడైనా వంతెన నిర్మాణం పూర్తిచేస్తారనే ఆశతో ఉన్న ప్రజలకు మళ్లీ నిరాశే మిగిలింది.



పూర్తి కావాల్సిన అప్రోచ్

కొనసాగుతున్న నిర్మాణ పనులు...

మూడు సంవత్సరాల క్రితం పెద్దవాగు వంతెనకు సంబంధించిన పిల్లర్లు కుంగిపోవడంతో దహెగాం నుండి కాగజ్‌నగర్‌కు రాకపోకలు నిలిపివేశారు. దీంతో నాటు పడవల ద్వారా ప్రజలు పెద్దవాగు దాటి కాగజ్‌నగర్ పట్టణానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించారు. ఇలా రెండు సంవత్సరాలు గడవగా ముచ్చటగా మూడో సంవత్సరం గడుస్తున్నప్పటికి ఈ ఏడాదైనా పనులు పూర్తవుతాయని ఆశపడ్డారు. కానీ ఈసారి కూడా వంతెన నిర్మాణం దాదాపూ పూర్తయినప్పటికీ అప్రోచ్‌కు సంబంధించిన పనులు మిగిలి ఉండగానే శనివారం రాత్రి ఎగువున కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగులో వరద నీరు చేరడంతో తాత్కాళిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాలతో పాటు దహెగాం, భీమిని మండలాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. వర్షాకాలం సమీపిస్తుందని, వరదలు వస్తాయని తాత్కాళిక వంతెన తెగిపోయే అవకాశం ఉందని తెలిసినా కూడా సంబంధిత అధికారులు పనులను వేగవంతం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

తప్పని అదనపు భారం...

తాత్కాళిక వంతెన కొట్టుకుపోవడంతో భీమిని, దహెగాం మండలాలకు ప్రధాన రవాణా మార్గం లేకుండా పోయింది. దీంతో వివిధ పనుల నిమిత్తం నిత్యం కాగజ్‌నగర్‌కు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే ఆయా గ్రామాల నుండి పెద్దవాగు వంతెన వరకు చేరుకొని అక్కడి నుండి నిచ్చెన సహాయంతో పెద్దవాగు బ్రిడ్జిని ఎక్కి అవతలికి దాటాల్సి వస్తుంది. అనంతరం అక్కడి నుండి మరో వాహనంలో కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, దీంతో రవాణా భారం అధికమవుతుందని ప్రజలు వాపోతున్నారు. అంతే కాకుండా కాగజ్‌నగర్ పట్టణానికి అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీలు, బాలింతలు, వృద్దులు, చిన్నపిల్లలు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోక తప్పదు. దీనివల్ల కూడా ప్రజలకు అదనపు భారం తప్పడంలేదు. దీనికితోడు దహెగాం మండల ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర సరుకులతో పాటు వ్యవసాయ అవసర వస్తువులకు కూడా ధరలు పెంచి అమ్మే అవకాశం లేకపోలేదు.. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అప్రోచ్ నిర్మాణం పూర్తి చేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.



వంతెన తెగడంతో నిర్మాణంలో ఉన్న వంతెన పై నుండి వెళ్తున్న జనం



నిర్మాణంలో ఉన్న వంతెన పై నుండి కోళ్ల ను మోసుకుపోతున్న యువకులు

నిర్లక్ష్యంగా మురుగు కాలువల పనులు


- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో నాలుగు వరుసల రహదారిలో డీబీఎల్ కంపెనీ చేపట్టిన పనుల్లో నిర్లక్ష్యంతో మురికి కాలువల నిర్మాణంలో ముందు జాగ్రత్త చర్యలు లేక ఇష్టానుసారం నిర్మించారు. తిరిగి మళ్లీ మరమ్మత్తు పనులు చేపట్టడంతో పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి పనులు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుడి, ఎడమవైపు నిర్మించిన మురికి కాలువలు సరిగా లేకపోవడంతో నీరు మురికి కాలువలోకి వెళ్లక వచ్చిన మొత్తం నీళ్లు దుకాణ సముదాయాలు, హనుమాన్ మందిర్‌లోకి వెళ్లడంతో ప్రస్తుతం తిరిగి మురికి కాలువలు మరమ్మత్తులు చేపడుతున్నారు. అయినా ఇప్పటివరకు నీరు పోతాయా లేదా అనేది సందిగ్ధంలో ఉంది. ప్రస్తుతం మరమ్మత్తు పనులు చేపట్టడంతో రోడ్డుపైనే మురికి కాలువలు తవ్వి మట్టిని పోయడంతో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు డీబీఎల్ కంపెనీ చేపడుతున్న పనులపై దృష్టి సారించాలని మండలవాసులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని అక్షర పటేల్ జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి మధుకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలానికి చెందిన అక్షర పటేల్ తన గైడ్ టీచర్ రమావత్ శ్రీనివాస్‌తో కలిసి 'బయోడీగ్రేబుల్ సీడింగ్ పాట్స్ ఫ్రం ప్యాడి గ్రాస్' ప్రాజెక్టు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా విద్యార్థిని తన స్వగ్రామంలో వరి పంట కోత తర్వాత గడ్డిని కాల్చి వేయడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు వ్యాధుల బారిన పడుతున్నారని తెలుసుకుంది. పంట దిగుబడి కూడా తగ్గుతుందని గుర్తించి దాని నివారించడానికి వరిగడ్డిని కాల్చకుండా ఆ గడ్డితో మొక్కలను పెంచే ప్లాస్టిక్ కవర్లకు బదులు కుండీలను తయారుచేసి ఉపయోగించే విధానాన్ని కనుక్కున్నాడు. దీనినే ప్రాజెక్టు రూపంలో ప్రదర్శించి జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినిని జిల్లా విద్యాధికారి అశోక్‌తో పాటు నవోదయ ప్రిన్సిపాల్ చక్రపాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

వర్ష సూచనతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ డివి శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వాతావరణ శాఖ భారీ వర్ష సూచన మేరకు జిల్లా ప్రజలు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. వర్ష సూచన నేపథ్యంలో జిల్లాలోని పోలీస్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 3 రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచన మేరకు జిల్లా ప్రజలు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న నివాసలలో ఉండే వారు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాన్నారు. ప్రజలు వాగులు పొంగే రహదారుల్లో ప్రయాణాలు మానుకోవాలని, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రోడ్లపై వెళ్లే ప్రయాణికులు సాహసాలు చేసి ప్రమాదాలకు గురికావొద్దన్నారు. ప్రాణహిత నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది దగ్గరకు ఈత, సెల్ఫీ ఫోటోలు తీసుకోవడానికి వెళ్లవద్దని సూచించారు. పోలీసు అధికారులు సిబ్బంది తమ వెంట ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో పాటు రోప్స్, టార్చ్ లైట్స్, ట్యూబ్స్, లైవ్ జాకెట్స్ వెంట ఉంచుకోవాలని ఎలాంటి ప్రమాదం ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్య వస్తే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్- 100కు తక్షణ సహాయం కోసం ఫోన్ చేయాలన్నారు.

పడిపోతున్నా పట్టించుకోరా

- ప్రమాదకరంగా వంగిన విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-దహెగాం

దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి అంటారు పెద్దలు. పడిపోతే కానీ విద్యుత్ అధికారులు పట్టించుకొనేలా లేరు. మండలంలోని కొంచవెల్లి నుండి ఈకలగుండం వెళ్లే ప్రధాన రోడ్డు వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు పూర్తిగా ఒకవైపుకు వంగి పడిపోయేలా ఉన్నాయి. గట్టిగా గాలి వీచిన, భారీ వర్షాలకు కుంగిపోయిన పడిపోవడం ఖాయం. నిత్యం ఈ రోడ్డు గుండా సంబంధిత అధికారులు చూస్తూ పోతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎప్పుడు రోడ్డుపై పడిపోతాయో ఎలాంటి నష్టాన్ని చూడాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ స్తంభాలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

లాఠీచార్జీ, అక్రమ అరెస్టులను సహించేదిలేదు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్

నవతెలంగాణ-కెరమెరి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాఫర్

లాఠీచార్జీ, అక్రమ అరెస్టులను సహించేదిలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ నీట్ ఫలితాలను తక్షణమే రద్దుచేసి పరీక్షను తిరిగి నిర్వహించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇంటి ముట్టడి నిర్వహించిన వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై లాఠీచార్జీ, అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్ట్ చేసిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో పోలీస్ దాడులు, నిజామాబాద్ జిల్లాలో లాఠీచార్జీతో ప్రజాస్వామిక హక్కులు లేకుండా చేస్తున్నారన్నారు. నీట్ పేపర్ లీకేజీ వల్ల దేశంలో సుమారు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నీట్, నెట్ వంటి ప్రతిష్టాత్మకమైన ప్రవేశ పరీక్షల పేపర్ లీకేజీల ఉద్దాంతం రోజురోజుకు పెరిగి పెద్దదవుతుందని, పేపర్ లీకేజీ కేసులో ఇప్పటివరకు బీహార్ పోలీసులు 14 మందిని అరెస్ట్ చేసి కొంతమందికి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుకోవడం విడ్డురమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సుమారు 70 ప్రవేశ పోటీ పరీక్షల పేపర్స్ లీక్ అయ్యాయని ఆరోపించారు. దీంతో 1.7 కోట్ల మంది అభ్యర్థులు ఆశలపై నీళ్ల చల్లినట్టయిందన్నారు. పేపర్ లీకేజీల వల్ల విద్యార్థులకు, నిరుద్యోగ విద్యార్థులకు పోటీ, ప్రవేశ పరీక్ష లపై ఉన్న విశ్వాసనీయత సన్నగిల్లిపోతుందన్నారు. నీట్, నెట్ పేపర్స్ లీకేజీ వల్ల నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయమంటే, కేంద్ర ప్రభుత్వం తమ తప్పును కప్పి పుచ్చుకోవడం కోసం 'దీ నోటిఫికేషన్ ఆఫ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్' చట్టాన్ని తీసుకొస్తున్నట్లు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. నీట్, నెట్ పరీక్ష పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏను రద్దు చేసి లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు మొహర్లె రాంచందర్, లక్ష్మణ్, వడై తిరుపతి, సాయికుమార్, గోపిందర్ పాల్గొన్నారు.

చిరుజల్లులకే చిత్తడి

- ఒడ్డుగూడెంలో బురదకుంటను తలపిస్తున్న సీసీ రోడ్డు



ఒడ్డు గూడ లో సీసీ రోడ్డు పరిస్థితి



బురదలోంచి నడుస్తున్న జనం

నవతెలంగాణ-దహెగాం

పై ఫోటోలో కనిపిస్తున్నది బురదకుంట అనుకుంటే పొరపాటే. కానీ ఇది సీసీ రోడ్డంటే నమ్మసక్యం కావట్లేదు కదా. మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో దహెగాం నుండి చిన్నరాస్పెల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు ప్రక్కనే నిర్మించిన సీసీ రోడ్డు చిన్నపాటి వర్షానికే ఇలా బురదకుంటల మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అన్ని వైపుల నుండి ఎత్తు చేయడం వల్ల వర్షపు నీరు రోడ్డుపై నిలిచి బురదకుంటలా మారింది. దీంతో బురద నీటిలో నుండి నడవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ పలుమార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డుపై బురదను తొలగించి రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి





నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 71వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబులి పూలమాలలు వేసి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ప్రధాని నినాదంతో పని చేసిన మహానీయుడు ఆయన అన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆర్టికల్ 370ను రద్దు చేశారన్నారు. ఆయన చేసిన సేవలను స్మరించుకు ఆశయ సాధన దిశ ప్రతి కార్యకర్త ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు ముత్తు అశోక్, చన్నపూరి గణపతి, తాలూకా కన్వీనర్ వీరభద్ర చారి, పట్టణ అధ్యక్షులు సింధం శ్రీనివాస్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 71 వర్ధంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద గల జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర సాధన మొదట్లో శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతీయ జనసంఘ స్థాపించి తనకంటూ గొప్ప స్థానాన్ని సంపాదించుకున్నారని గుర్తు చేశారు. దీనిలో భాగంగా జిల్లా పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కిరణ్, సురేష్, పెంటయ్య, ప్రహ్లద్, ప్రణయ్, గొల్ల, గణేష్, నాగరాజ్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : జాతీయవాది, మాజీ కేంద్రమంత్రి, జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు డా.శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని బలిదాన్ దివాస్‌ను బీజేపీ నాయకులు నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్ ఆధ్వర్యంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు పెద్ది సంతోష్, వెంకన్న, నాయకులు గణపురం సంతోష్, నానయ్య, వగడి కిషన్, చౌదరి మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దహెగాం : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చితపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాపర్తి ధనంజయ, నాయకులు తోట చందు, దెబ్బటి సత్యనారాయణ, పుప్పాల లక్ష్మి నారాయణ, రమేష్ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాలలో 1994-95 పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాతో సన్మానించారు. అనంతరం విద్య బుద్దులు నేర్పించిన గురువుల ఆశీర్వాచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరికొకరు కలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వారు స్థిరపడిన రంగాల గురించి చర్చించారు. చాలా సంవత్సరాల తర్వాత ఈ కార్యక్రమం నిర్వహించడంతో చాలా సంతోషం వ్యక్తం చేస్తూ సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో రోహిత్ పాషా, మహేందర్, విలాస్, కమలాకర్, విజయలక్ష్మి, అపర్ణ, శ్రీలత, సునీత, సంగీత పాల్గొన్నారు.

మందమర్రి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలంపిక్ డే

నవతెలంగాణ-మందమర్రి

ప్రపంచ ఒలంపిక్ దినోత్సవం సందర్భంగా మందమర్రి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలంపిక్ డే రన్‌ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు జెండా ఊపి ఒలంపిక్ డే రన్ ప్రారంభించారు. సింగరేణి పాఠశాల మైదానం నుండి ప్రారంభమై ముఖ్య వీధుల్లో కొనసాగి సింగరేణి పాఠశాల మైదానంలో ముగించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రామ్ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కోశాధికారి కనపర్తి రమేష్, ఐఎన్టీయూసీ నాయకులు కాంపల్లి సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు గుడ్ల రమేష్, హ్యాండ్ బాల్ కోచ్ అరవింద్, రాజలింగు, సంతోష్, కళ్యాణ్‌గౌరీ, విశాల, శృతి, సాయి వర్మా, స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు, కార్మికులు వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నల్ల పోచమ్మ బోనాలు

నవతెలంగాణ-జన్నారం



మండలం ఫోన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వీర్లగుట్ట దగ్గర వెలిసిన నల్ల పోచమ్మకు మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం ఉపాధ్యక్షుడు చిలువేరు నరసయ్య కోడి జుట్టు కోశాధికారి రాజన్న మాట్లాడుతూ ఏటా మేదరి సంఘం ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేంద్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

27 నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



నవతెలంగాణ-మంచిర్యాల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని గ్రీన్ సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు యూనిక్స్ సన్ రైస్ పదవ రాష్ట్రస్థాయి సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామని ఆ సోసియేషన్ ఉమ్మడి జిల్లా వైస్ ప్రెసిడెంట్ బండ మీనారెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. ఆదివారం మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఈ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు సుమారుగా 250 నుంచి 300 మంది వరకు క్రీడాకారులు, మ్యాచ్ రిఫరీ ఒకరు, మ్యాచ్ కంట్రోలర్ ఒకరు, ఎంపైర్స్ ఎనిమిది మంది, పీడీలు 12 మంది, జిల్లా అసోసియేషన్ బాధ్యులతో కలిసి టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న వారందరికీ, భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని, 27వ తేదీన క్వాలిఫైడ్ మ్యాచులు, 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మెయిన్ డ్రా మ్యాచ్లు జరుగుతాయని, 28వ తేదీన పోటీల ప్రారంభ కార్యక్రమం, 30వ తేదీన గెలుపొందిన క్రీడాకారులకు ప్రైజెస్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు, క్రీడకాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, క్రీడాకారులు, క్రీడ అభిమానులు, క్రీడ పోషకులు, పట్టణ ప్రజలు అందరూ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు తిలకించేందుకు తరలి రావలని కోరారు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేష్‌రెడ్డి, కందికట్ల మధు, కార్యవర్గ సభ్యులు కృష్ణ, సీనియర్ క్రీడాకారుడు రవి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



నవతెలంగాణ-తాండూర్

మానవసేవయే మాధవసేవయని రక్తదానం ద్వారా ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న ప్రాణాలను రక్షించవచ్చునని విద్యా భారతి విద్యాసంస్థల నిర్వాహకులు సురభి ఆగామారావు తెలిపారు. ఆదివారం సురభి మినీ ఫంక్షన్ హాల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు శరత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. రక్తదానం చేయడం ద్వారా తల సేమియా వ్యాధిగ్రస్తులు ప్రమాదాల్లో గాయపడి అత్యవసర సమయాల్లో ప్రాణప్రాయ స్థితి నుండి రక్షించవచ్చని తెలిపారు. అత్యవసర సమయంలో రక్తం అందక ప్రాణాలు పోయిన కుటుంబాల ఆవేదన అంతులేనిదన్నారు. రక్తదానం చేసిన ప్రతి దాత మరొక ప్రాణికి ప్రాణదానం చేసిన వార వుతారని, దానం చేయడం వల్ల ఎలాంటి హాని లేదని తెలిపారు. రక్తదాన శిబిరంలో తాండూరు పరిసర ప్రాంతాల్లోని 58 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అభినవ సంతోష్ కుమార్, కాసర్ల శ్రీనివాస్, డాక్టర్ రంజిత్ కుమార్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు సిద్ధిక్, బ్లడ్ బ్యాంక్ సూపర్‌వైజర్‌లు మాధవి, విజయ్, స్టాఫ్ నర్స్ సంధ్య, టెక్నీషియన్లు వేణు, సాయి లక్ష్మి, బ్లడ్ బ్యాంక్ అంబులెన్స్ డ్రైవర్ హరీష్ పాల్గొన్నారు.

పోన్కల్ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

పొన్కల్ గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఆదివారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లెక్కల మల్లయ్య, గౌరవ అధ్యక్షుడిగా కస్తూరి భూమన్న, ఉపాధ్యక్షుడిగా బొడ్డు రాజన్న, ఆముదాల శ్రీనివాస్, భూతం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అప్పల జలపతి, కార్యదర్శులుగా ఎడ్ల ఉదయ్, దాసరి శ్రీనివాస్, కోశాధికారిగా పూదరి నరసయ్య, ప్రచార కార్యదర్శిగా దాసరి రాజన్న, కార్యనిర్వాహ కార్యదర్శిగా తిరుపతి, మల్లేశ్ సహాయ కార్యదర్శులుగా రాజేందర్, నరసయ్య చంద్రమోహన్లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు కాసెట్టి లక్ష్మణ్, కొంతం శంకరయ్య, పూదరి సత్యనారాయణ, తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా జీలుగ విత్తనాలు

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల పరిధి రైతుల సౌకర్యార్థం జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు స్థానిక వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో 139 జీలుగ బస్తాలు నిల్వ చేసి ఉంచినట్లు తెలిపారు. విత్తనాలు అవసరమైన వారు పట్టాపాస్ బుక్ జిరాక్స్‌లతో రైతు వేధిక వద్ద సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఉన్న రోడ్డును నిరుపయోగం చేశారు

- కోనంపేట గ్రామ ప్రజల ఆవేదన

నవతెలంగాణ-మంచిర్యాల



నెన్నెల మండలంలో గల మన్నెగూడ క్రాస్ రోడ్ నుండి కోనంపేట వరకు దాధాపు 5 కిలో మీటర్ల మేర వేసిన మట్టి రోడ్డు వివాదస్పదంగా మారింది. గత ప్రభుత్వంలో రూ కోటితో గ్రామాల్లో రోడ్లు వేసేందుకు డీఎమ్ఎఫ్టీ నిధులు వచ్చినప్పటికీ ఫారెస్ట్ అధికారుల అనుమతి లేకపోవడంతో రోడ్ పనులను ఆపేశారు. అధికారులు తాజాగా కొందరు గుత్తే దారులు డీఎంఎఫ్టీ కింద ఉన్న రూ 20 లక్షల నిధులతో మన్నెగూడ క్రాస్ రోడ్డు నుంచి కోనంపేట గ్రామం వరకు రోడ్డు వేశారు. రోడ్డు పూర్తి ఐన 4 రోజులకే రోడ్డు అంత బురద మయమైంది. కోనంపేట, పాటివాడ, బోగంపల్లి గ్రామాలకు వెళ్లే గ్రామస్థులు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.లక్షల నిధులతో రోడ్డును అభివృద్ధి చేయడం పోయి నాసి రకం రోడ్డు వేసి మంచిగా ఉన్న రోడ్డును పాడు చేశారని నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు రోడ్డు పనులు ప్రారంభంలోనే నాయకులకు గ్రావెల్ మట్టితో రోడ్డు వేయాలని కోరిన వినలేదని, అందుబాటులో ఉన్న బంక మట్టిని తీసుకొచ్చి రోడ్డు వేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఒక్కరోజు వర్షం కురవడం తో రోడ్డు అంత బురదగా మారి, గ్రామస్థులు ఆ రోడ్డుపై రాక పోకలు కొనసాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు, బైక్‌లు మొత్తానికే రోడ్‌పై నడవక పోవడంతో చాల దూరం వరకు కాళీ నడకన గ్రామస్థులు వెళ్తున్నారు. ఏదైనా ఎమర్జెన్సీ వాహనం గ్రామంలోకి రావాలన్న రాకుండా రోడ్డు అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు వేల జనాభ ఉన్న మూడు గ్రామాలకు రోడ్డు మార్గం ఇలా బురద మాయం కావడంతో నిత్యం పనులకు వెళ్లే వాళ్ళు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయా గ్రామలకు చెందిన వారు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితి తెచ్చిన సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నాన్యమైన రోడ్డు వేసివ్వాలి

జాంపం బానయ్య, కోనంపేట గ్రామస్థుడు



గతంలో ఉన్న రోడ్డె బాగుండే, మా గ్రామనికి కొత్త రోడ్డు వేస్తున్నారంటే గ్రామస్థులం అంత సంతోషం పడ్డాం. కానీ ఇలాంటి పనికిరాని రోడ్డు వేయడంతో గ్రామంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోడ్డు వేసిన 4 రోజులకే మొత్తం బురదగా మారి నడవడానికి కూడా ఇబ్బందిగా మారింది. ఇపుడు గ్రామాన్ని ధాటి ఎటు వెల్లలేని పరిస్తితి నెలకొంది. అధికారులు నాయకులూ స్పందించి గ్రామస్థుల సౌకర్యార్థం నాణ్యతతో కూడిన రోడ్డు పనులు చేపట్టగలరు.

వెనుకబాటు తనాన్ని విడనాడాలి

- బెల్లంపల్లి ఏసీపి రవికుమార్



నవతెలంగాణ-తాండూర్

ఆధునిక సమాజంలో ఆదివాసి గిరిజనులు వెనుకబాటు తనాన్ని విడనాడి, అన్ని రంగాల్లో రాణించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. ఆదివారం నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో నిరుపేదలకు రాబిన్ హుడ్ ఆర్మీ దాతల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు బాణుమతి, చేతబడి పేరుతో ఆధునిక వైద్యానికి దూరంగా ఉంటూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఆధునిక వైద్య విధానంలో అన్ని రకాల రోగాలకు మందులున్నాయని తెలిపారు. వర్షాకాలం దృశ్య ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెలిమలు, వాగుల్లోని నీళ్లను తాగారాదన్నారు. ఆవాసాలకు దూరంగా పెంట కుప్పలు వేయాలని సూచించారు, చదువుకునే పిల్లలను పనిలో కాకుండా బడిలో ఉంచాలన్నారు. అక్షరాస్యత వల్ల అజ్ఞానం వైదొలుగుతుందని తెలిపారు. గిరిజనులు నాటు సారాతయారీ, గాంజాయి సాగుకు దూరంగా ఉండాలని తెలిపారు. మత్తు పదార్థాల ఉత్పత్తి కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తుందన్నారు. నాటు సారా గంజాయి సేవించడం వల్ల గిరిజనులు 50 ఏళ్లకే తనువు చాలిస్తున్నారని తెలిపారు. గిరిజనులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ పకృతి ఒడిలో స్వేచ్ఛగా జీవనం కొనసాగించాలని సూచించారు. తాండూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ గిరిజనుల శ్రేయస్సు కోసం పోలీసు శాఖ కృషి చేస్తుందని తెలిపారు. స్థానికుల అవసరాలను సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని అక్కడి గిరిజనులను కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల పరిసరాలలో సంచరించిన, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, మాదారం ఎస్ఐ అనూష, గ్రామస్తులు పరపతిరావు, అమృత రావు, బాపురావు పాల్గొన్నారు.



నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం మంచిర్యాల పట్టణంలోని పద్మ నాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ప్రమాణ స్వీకరానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరల ప్రేమ్ సాగర్ రావు హాజరై నూతనంగా ఎన్నికైన చైర్మన్ పయ్యావుల పద్మ, వైస్ చైర్మన్ బండారి సుధాకర్, డైరెక్టర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్ట పడ్డ కార్యకర్తలకు, నాయకులకు కాంగ్రెస్ అన్యాయం చేయదని తెలిపారు. ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎదిగిన పద్మ ను చుస్తే సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతనికి చెందిన నాయకురాలికి చైర్మన్, పట్టణ ప్రాంతానికి చెందిన యువ నాయకుడిని వైస్ చైర్మన్‌లుగా నియమించడం జరిగిందని తెలిపారు. పార్టీ కోసం నిబద్ధతతో పని చేసే ప్రతి ఒక్కరికీ ఏదో రకంగా అవకాశాలు వస్తాయని తెలిపారు. ఇంద్రవెల్లి సభ సాక్షిగా రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తదని సీఎం రేవంత్‌రెడ్డి అప్పుడే చెప్పాడని, అప్పుడు సభ అంత విజయవంతం కావడానికి కార్యకర్తలే ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. మంచిర్యాల తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ఉనికిని చాటడానికి ముఖ్య కారణం గత కొన్ని ఏండ్లుగా పార్టీ పట్టుకొని పని చేస్తున్న కార్యకర్తల్లో ఉన్న ధైర్యమే అని తెలిపారు. నా పై నమ్మకంతో పార్టీ కోసం కష్ట పడి నన్ను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టిన ప్రతి ఒక్క కార్యకర్తకు రుణ పడి ఉంటానన్నారు. నియోజక వర్గంలో రైతులు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సంతోషంగా ఉన్నారని, నియోజక వర్గానికి తాగు, సాగు నీరు, విద్య వైద్యంలో ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకుంటానని హామి ఇచ్చారు. నియోజక వర్గంలో ఎటువంటి పంట నష్టం జరగలేదని ఇచ్చిన మాట ప్రకారం నియోజక వర్గనికి ఇచ్చిన హామీలు నెరవేరుస్తూన్నమన్నారు. ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని కూడా త్వరలోనే తీరుస్తమని నియోజకవర్గ ప్రజలకు హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ పాల్గొన్నారు.



ఘనంగా జనసంఘ్ వ్యవస్థాపకుడి వర్ధంతి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్, కేంద్ర ఫిలిం బోర్డ్ సభ్యులు ఆరుముళ్ల పోశం మాట్లాడుతూ ఈ నెల 25, 26 తేదీలలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జ్ఞాపకార్థంగా మున్సిపాలిటీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. ముఖర్జీ దేశం కోసం చేసిన సేవలు మరవలెవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కట్ట ఈశ్వరచారి, మాస్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు బంగారు వేణుగోపాల్, పట్టణ ఉపాధ్యక్షుడు వైద్య శ్రీనివాస్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు సంతోష్ రామ్ నాయక్, సీనియర్ నాయకులు కుమ్మరి రామ్‌కిషోర్, జీడి ప్రభాకర్, మోత్కూరి దేవేందర్, ఉరుసు నరసయ్య పాల్గొన్నారు.



చెరువును కాపాడాలని గంగపుత్రుల ధర్నా



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని(చెర్లపల్లి) కిష్టాపూర్ గ్రామంలో ఉన్న ఊర చెరువును కాపాడాలని స్థానిక గంగపుత్రులు ఆదివారం చెరువులోనే బైటాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది అక్రమంగా పట్టాలు చేసుకుని కబ్జా చేసుకుంటున్నారని, వెంటనే ఆ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చెరువు కబ్జాకు గురి అవ్వడంతో ఆ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కొంతమంది కబ్జా చేసిన స్థలంలో చెరువులో నుంచి మట్టిని తీసి ఆ స్థలంలో పోసుకొని పంట సాగు చేసుకోవడానికి చూస్తున్నారన్నారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గుతుందన్నారు. ఈ చెరువుపై దాదాపు 80 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని తెలిపారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే ఆ చెరువులో పోసిన మట్టిని, తొలగించి చెరువును కబ్జా కాకుండా చూడాలని కోరారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు, ధర్నాలో గంగపుత్రులు భీమరాజు మల్లే శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-మందమర్రి

మేదరివాడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల 1986-1987 బ్యాచ్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ యూపీఎస్ పాఠశాలలో 7వ తరగతి చదువుకుని 37 సంవత్సరాల తరువాత ఈ విధంగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మేమంతా గొప్ప స్థాయికి ఎదగడానికి గురువులే కారణమని, తల్లిదండ్రుల తరువాత ఎవరైనా గురువులను గౌరవించాలన్నారు. త్రిమూర్తులు అంటే తల్లి, తండ్రి, గురువు అన్నారు. గురుదక్షిణ కింద వారికి ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేమని తెలిపారు. గురువులు మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత విద్యార్థులందరినీ కలుసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులు తమ కంటే ఉన్నత స్థాయికి ఎదిగితే దానికి మించిన గురుదక్షిణ మరొకటి లేదన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సతీశ్, పూర్వ ఉపాధ్యాయులు సూర్యనారాయణ, మహేందర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ, సామల అశోక్, గట్టు శ్రీనివాస్, మీసాల అప్పారావు, పంజాల ఈశ్వర్ దేవేంద్ర, వెంకటలక్ష్మి, ఉమాదేవి, పద్మ పాల్గొన్నారు.

కిష్టాపూర్ చెరువులో సర్వే చేపట్టిన అధికారులు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిస్టాపూర్ గ్రామంలో ఉన్న ఊర చెరువు కబ్జాకు గురైందని ఆ గ్రామ గంగ పుత్రులు, గ్రామస్థులు, అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం మధ్యాహ్నం ఇరిగేషన్ డీఈ వెంకటేశం ఆధ్వర్యంలో చెరువులో సర్వే నిర్వహించారు. చెరువుల అక్రమానికి గురైన భూమిని గుర్తించామని అక్కడ పోసిన మట్టిని తీసివేయాలని అక్రమణదారులకు సూచించామని తెలిపారు. చెరువులో నీరు ఉన్నంతవరకు అది ప్రభుత్వ భూమి అన్నారు. చెరువు నీటిలో మునిగి ఉన్న భూమికి పట్టా ఉన్నప్పటికీ అక్కడి ఎలాంటి పంటలు వేసుకో రాదని భూమిని చదును చేసుకోరాదని డీఈ తెలిపారు. అక్రమంగా పోసిన మట్టిని వెంటనే తొలగించాలని లేకుందటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈ రాజు, సూపర్‌వైజర్ శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

నవతెలంగాణ-జైపూర్



జన్ సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు ఆదివారం భీమారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘణంగా నిర్వహించారు. చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారి భీమారం బస్టాండ్ ప్రధాన కూడలిలో శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి ఆలం బాపు, ప్రధాన కార్యదర్శి మాడెం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కొమ్ము దుష్యంత్ యాదవ్, దుర్గం కత్తెరసాల, దుర్గం జనార్థన్, వేల్పుల సతీష్ కార్యదర్శి ఆకుదారి శంకర్, మహిళా మోర్చ అధ్యక్షురాలు మేడి విజయ, బీసీ మోర్చ అధ్యక్షుడు ఆవిడపు సురేష్, సకినారపు మల్లేష్ పాల్గొన్నారు.

ప్రాణ స్నేహితులకు పోలీస్ పతకాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పలువురు పోలీసులకు సేవా పతకాలు లభించాయి. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో ఇంటిలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌రెడ్డి, పోశెట్టికి వారు చేసిన ఉత్తమ సేవలకు గుర్తించి, ప్రభుత్వం పోలీసు సేవా పతకాలు అందజేసింది. కాగా వారు ఇరువురు చిన్నప్పటి నుంచి ప్రాణస్నేహితులు కావడం విశేషం. ఇద్దరికి ఒకేసారి సేవా పతకాలు రావడంతో హర్షం వ్యక్తం చేశారు. పలువురు వీరికి అభినందనలు తెలిపారు.

విద్యుద్ఘాతానికి గుర్రై గేదె మృత్యువాత

నవతెలంగాణ-నేరడిగొండ



విద్యుద్ఘాతానికి గుర్రై గేదె మృత్యువాత పడ్డ సంఘటన ఆదివారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు జాదవ్ జవహర్‌లాల్ రోజువారీగా ఆదివారం ఉదయం గేదెను మేతకు ఊరు బయటకు వదిలాడు. అటువైపు ఓ రైతు చెనులో విద్యుత్ మోటారు బిగించివుంది. వర్షం కారణంగా కరెంటు మోటరు వైరు ఎర్తింగ్‌తో అక్కడ గేదె మేస్తున్న క్రమంలో విద్యుద్ఘాతానికి గుర్రై మృతి చెందింది. ఆ గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుంది. విద్యుత్ శాఖ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. బాధిత రైతును ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సీఎంను కలిసిన గజేందర్



నవతెలంగాణ-నేరడిగొండ

సీఎం రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆదివారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర మంత్రి సీతక్క, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలను తెలియజేశారు. అటవీ భూముల సమస్య, కుప్టి ప్రాజెక్ట్ ఇతర అంశాలపై చర్చించినట్లు ఆడే గజేందర్ తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించి త్వరలో నియోజకవర్గంలోని సమస్యలన్నీ తీరుస్తానని హామీ ఇచ్చారన్నారు.

అడెల్లి ఆలయాన్ని దర్శించుకున్న మాజీ మంత్రి



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయాన్ని ఆదివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు మాజీ మంత్రికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణం పనులను పరిశీలించారు. ఆయన వెంట నాయకులు మాధవరావు, నారాయణరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాజేశ్వర్ రావు, ఉట్ల రాజేశ్వర్, ఆలయ కాంట్రాక్టర్ లక్కిడి జగన్ మోహన్ రెడ్డి ఉన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-తాంసి

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం భీంపూర్ మండలంలోని కరంజి గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు రైతులు రూ. రెండు లక్షల రుణమాఫీ హర్షిస్తూ రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్‌గా ఉందన్నారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఏకకాలంలో రూ. రెండు లక్షల రుణమాఫీ చేయడానికి ముందుకు రావడం విషయం అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను గుర్తించిన ఏకైక పార్టీ కాంగ్రెస్, ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో నారాయణరావు, శ్రీనివాసరెడ్డి, దేవరెడ్డి, విఠల్, అక్షయ్, రైతులున్నారు.

అడెల్లి ఆలయాన్ని దర్శించుకున్న న్యాయమూర్తి



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి శ్రీమహా పోచమ్మ ఆలయాన్ని ఆదివారం నిర్మల్ సీనియర్ సివిల్ జడ్జి రాధిక దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మొదటి సారిగా ఆలయానికి వచ్చిన న్యాయమూర్తి రాధికను ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలోఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేంద్ర నిధులు

నవతెలంగాణ-భైంసా

భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం పీఎం ఉషా పథకంలో రూ.ఐదు కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తెలిపారు. గదుల నిర్మాణానికి, మరమ్మతులకు రూ.3.97 లక్షలతో పాటు మిగతా నిధులు సౌకర్యాల కల్పన కోసం వినియోగిస్తారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ హయంలోనే విద్య రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఓం శాంతి 59వ పుణ్యస్మృతి దివాస్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని 18 వార్డులోని ఓంశాంతి కాలనీలో నిర్వహించిన 59వ పుణ్యస్మృతి దివాస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవనశైలి మార్చుకోవాలని సూచించారు. సమస్యలు అనేవి మానవులకి వస్తాయని, ఆ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలనేవి ఓంశాంతి ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్, హఫీస్ బాగ్ మిర్జా, పాత శివ కృష్ణమూర్తి, మాజీ కౌన్సిలర్ సుధాకర్, బ్రమ్మ కుమారీలు తదితరులు పాల్గొన్నారు.

రూ.77 లక్షలకుపైగా నిషేధిత గుట్కా పట్టివేత

- అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్..నిందితులపై కేసు.. గుట్కాస్వాధీనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఐదు గోడౌన్స్‌లో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆధ్వర్యంలో శనివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఎస్పీ, డీఎస్పీ, సీసీఎస్ సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది కలిసి పట్టణంలోని ఓంకార్ జిన్నింగ్ మిల్, నాలుగు గోడౌన్స్‌లలో చాంద వద్దగల ఒక గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.77,60,586 విలువ చేసే నిషేధిత గుట్కా లభించింది. తనిఖీల్లో భాగంగా వన్ టౌన్ పీఎస్ పరిధిలోని ఓంకార్ జిన్నింగ్‌లో గల నాలుగు గోడౌన్స్‌లో రూ.50,16,942 విలువచేసి దాదాపు 20 రకాల నిషేధిత గుట్కా లభించిందని, నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.27,43,644 విలువ చేసి నిషేధిత గుట్కా లభించిందని నలుగురిపై కేసులు నమోదు చేశారన్నారు. స్వాధీనం చేసుకున్న నిషేధిత గుట్కా విలువ రూ.77,60,586 విలువ చేసే నిషేధిత గుట్కాను సీజ్ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేయడం జరిగిందని మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల్లో సాజిదుల్లా ఖాన్, అస్లాం ఖాన్, సమీ ఉల్లా ఖాన్, ఫసివుల్లా ఖాన్ ఉన్నారని తెలిపారు. ఇందులో అర్బాజ్ అలీ పరారీలో ఉన్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా గుట్కా విక్రయదారులు నిషేధిత గుట్కాను విక్రయించడం మానుకోవాలని సూచించారు. అర్ధరాత్రి దాడుల్లో జిల్లా ఎస్పీతో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సీఐలు కే సత్యనారాయణ, ఎ.అశోక్, ఎ.రమాకాంత్, సీసీఎస్ సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి

- ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

దేశమంతా ఒకే చట్టం ఒకే ఎజెండా ఉండాలని పోరాడిన మహా యోధుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ జరుపుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. జన సంఘ్ వల్లే కేంద్రంలో బీజేపీ 17 సంవత్సరాల పాటు అధికారంలో ఉండి దేశాన్ని అభివృద్ధి పరచడంలో ముందుందన్నారు. మరో ఐదు సంవత్సరాల కాలంలో ప్రధాని నరేంద్ర మోడీ హయంలో ప్రపంచంలోనే దేశం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. 370 ఆర్టికల్ రద్దు, ఒకే దేశం ఒకే చట్టంపై పోరాడిన మహాయోధుడు ముఖర్జీని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జైల్లో వేసి నిర్బంధించడం వల్లే ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త నడుచుకోవాలి అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణ అధ్యక్షులు ఎనపోతుల మల్లేష్, బాసర జడ్పీటీసీ వసంతా రమేష్, రాష్ట్ర నాయకులు బాజీరావు పటేల్, కౌన్సిలర్లు రావుల పోశెట్టి, గౌతం పింగ్లే, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోటలింగురాం, మాజీ సర్పంచ్ రాకేష్, నాయకులు గాలి రవి, తుమ్మోల్ల దత్తాత్రి, గాలి రాజు ఉన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సాబ్లే సంతోష్ సింగ్, ప్రధాన కార్యదర్శులు బంటు ప్రవీణ్, ధర్మపురి రాఘవులు, నాయకులు భీంరావ్, దేవ్‌రావ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పాలిసెట్ కౌన్సిలింగ్

- తొలిరోజు129 విద్యార్థుల వేరిఫికేషన్ పూర్తి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం పాలిసెట్ అభ్యర్థులకు నిర్వహించే ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ ప్రక్రియ కొరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పాలిసెట్ కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ తెలిపారు. కౌన్సిలింగ్ ప్రక్రియను కోఆర్డినేటర్ పరిశీలించి, సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. అటు ధృవపత్రాల పరిశీలన అనంతరం విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు తదుపరి ప్రక్రియ గురించి వివరించారు.

సరైన ధృవపత్రాలు తప్పకుండా తీసుకురావాలి

ఈ సందర్భంగా పాలిసెట్ సమన్వయ కర్త మాట్లాడుతూ ధృవపత్రాల పరిశీలన కొరకు స్లాటు బుకింగ్ చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం, సోమవారం, మంగళవారం మూడు రోజుల పాటు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ధృవపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట పాలీసెట్ ర్యాంకు కార్డు, హాల్ టికెట్, ఎస్సీసీ మెమో, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు.

షెడ్యూల్ వివరాలు..

మొదటి విడత పాలిసెట్ ధృవపత్రాల పరిశీలన పూర్తయిన వారు ఈనెల 27లోపు వెబ్ అప్షన్లు పెట్టుకొని కళాశాలలను ఎంపిక చేసుకోవాలని కోఆర్డినేటర్ తెలిపారు. కళాశాలలు ఎంపిక చేసినవారికి జూన్ 30న సీట్ల కేటాయింపు ఉంటుందని వెల్లడించారు. జూన్ 30 నుండి జులై 4 వరకు ట్యూషన్ ఫీజు చెల్లింపు చేసి కళాశాలలో రిపోర్ట్ చేయాలని అన్నారు. జులై 7 నుండి రెండో విడత ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.

తొలిరోజు 129 మంది ధృవపత్రాల పరిశీలన పూర్తి..

పాలిసెట్ ధృవపత్రాల పరిశీలన ప్రక్రియలో మొదటి రోజు ఆదివారం 145 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా 129 మంది విద్యార్థులు హాజరయ్యారు. మిగతా వారు సరైన ధృవపత్రాలు తీసుకురాకపోవడంతో పెండింగ్‌లో ఉంచారు. వారు తదుపరి రోజు సబ్మిట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ రాజ్ కుమార్, సిస్టం అనలిస్ట్ సుజయ్, అధ్యాపకులు శ్రీనివాస్, క్రాంతి కుమార్, ప్రవీణ్, సురేష్, హేమలత, రవికుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

దీపక్ బైజును సన్మానించిన ఎస్టీ సెల్ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో చత్తీస్‌ఘడ్‌లో ఆదివాసులపై జరుగుతున్న హత్యాకాండను నిలిపివేయాలని ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సదస్సులో ముఖ్యఅతిథిగా చత్తీస్‌ఘడ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) రాష్ట్ర అధ్యక్షులు దీపక్ బైజు హాజరయ్యారు. అలాగే వారితోపాటు కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్ హాజరయ్యారు. హైదరాబాద్‌కు వచ్చిన చత్తీస్‌ఘడ్ పిసిసి రాష్ట్ర అధ్యక్షులు దీపక్ బైజును కామారెడ్డి జిల్లా ఎస్టి సెల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్, భూక్యా రాజు నాయక్, సదర్ నాయక్, మోహన్ నాయక్, శ్రీను నాయక్, కృష్ణ నాయక్, రవి నాయక్, కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

నవతెలంగాణ-దోమకొండ

జాతీయస్థాయి ఖేలో ఇండియాలో ప్రతిభ చూపిన దోమకొండ మండల కేంద్రానికి చెందిన కదిరే సింధుజ, ఆర్చరీ స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన శ్రీధర్‌ను మండల కేంద్రంలోని గడి కోటలో ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల తిరుమల్‌గౌడ్, నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి ఖేలో ఇండియాలో సింధూజ ప్రతిభ చూపటంపై అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆర్చరీ క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కోటాతో చిన్న వయసులో ఉద్యోగం సాధించిన శ్రీధర్‌ను అభినందించారు. దోమకొండ ప్రాంత విద్యార్థులు ఆర్చరీ క్రీడా శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కోచర్ ప్రతాప్‌దాస్, ఆర్చరీ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, సలహాదారులు పిన్నెం రామచంద్రం, పున్న లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రైతుల ముఖాల్లో ఆనందం చూడడమే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆశయమని మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్ క్యాంప్‌లో నాయకులతో, రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. నసురుల్లాబాద్, బీర్కూర్, వర్ని, కోటగిరి మండలాల్లో ఇప్పటికే వరినాట్లు వేస్తున్నారని, నారుమల్లు పెరిగినా.. సాగునీరు లేకపోవడంతో రైతులకు జాప్యం జరుగుతుందని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి రైతులు తీసుకువెళ్లగా.. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యను వివరించారని తెలిపారు. సాగునీరు విడుదలకు కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నేడు నిజాంసాగర్ సాగునీటిని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విడుదల చేశారని అన్నారు. తక్కువగా ఉన్న సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఒక్క చుక్క కూడా నీరు వృథా పోకూడదన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు కెనాల్ కట్టపై పర్యటించి వివరాలు తెలుసుకోవాలన్నారు. వీరివెంట ఎంపీపీ పాల్త్యా విఠల్, సొసైటీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని గుండూరు రోడ్డు, బస్టాండ్ ఆవరణలో గల రహదారులపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్‌వార్ వినోద్ కంకర మిశ్రమంతో గుంతలను ఆదివారం పూడ్చివేయించారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల కారణంగా ఆగిపోయిన ఆ రోడ్డు, బస్టాండ్ పనులు త్వరలోనే ప్రారంభించడానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మణ్ పటేల్, మాజీ ఎంపీటీసీ ఇమ్రాన్ ఖాన్, అనిల్ సెట్, అస్పత్‌వార్ అరుణ్, గాయక్వాడ్ విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

రాజకీయ పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేయాలని సీపీఐ(ఎం) ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేస్తూ, ప్రజలకు మెరుగైన జీవితం కోసం ప్రజలను అంటి పెట్టుకొని ఉండాలని అన్నారు. పరిస్థితులను వారికి నేర్పుతూ మనం నేర్చుకుంటూ వారిని ఉద్యమంలో ఉంచే విధంగా చూడాలని తెలిపారు. సమాజ మార్పుకు నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టు పార్టీ సభ్యులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, సీపీఐ(ఎం) నిర్మల్ నియోజకవర్గ కార్యదర్శి బొమ్మెన సురేష్, నిర్మల్ పట్టణ కార్యదర్శి ఫసియోద్దీన్, పట్టణ నాయకులు రాజమణి, వెస్లీ, దిగంబర్, సంతోష్, గంగారామ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియ పట్ల పీఆర్టీయూ హర్షం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దశాబ్ద కాలం నుంచి నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం, చేపట్టడం హర్షనీయమని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్‌సింగ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ధన్యవాదాలు తెలిపారు. పది సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు లేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులు ఇబ్బందులను గ్రహించి పదోన్నతులు, బదిలీలు చేపట్టడం హర్షనీయమన్నారు. ఎస్జీటీలకు బీఎడ్, డీఎడ్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్, గౌరవ అధ్యక్షుడు బాబన్న, జాదవ్ ప్రకాష్, మోహన్, దినేష్, అంబాజీ, పొచ్చన్న, సంతోష్ పాల్గొన్నారు.

నేటి ధర్నా విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

తుడుం దెబ్బ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు గోడం గణేష్ తెలిపారు. కుమురం భీం కాలనీలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ నిరుద్యోగులు, విద్యార్థిని, విద్యార్థులు ఆదివాసీ రైతులు, మేదావులు, ప్రజాప్రతినిధులు సోమవారం నాడు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉయిక సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, డివిజన్ ఉపాధ్యక్షులు ఆత్రం గణపతి, మావల మండల అధ్యక్షులు వెడ్మ ముకుందరావు, మండల ఉపాధ్యక్షులు తొడసం ప్రకాష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం

నవతెలంగాణ-లోకేశ్వరం

ఎన్నికల హామీలో భాగంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి తన మాటను నిలబెట్టుకుని రైతుల పక్షాన నిలిచారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించినందుకు గాను మండలంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి, సుందరగిరి ముత్తగౌడ్, జిలకరి సాయిప్రసాద్, ఇలియాస్, తదితర నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వర్షం.. జలమయమైన మార్కెట్

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి వారసంత నిర్వహించే ప్రదేశం జలమయమైంది. ఈ క్రమంలో వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ కారణంగా వ్యాపారం కొనసాగించాలంటే చాలా కష్టంగా ఉందన్నారు. అధికారులు స్పందించి ఇలాంటి సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

